తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

ఆదివారం 11.10.2026 | సంపుటి : 13 సంచిక : 82 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

# నిరసనగళంపై ఉక్కుపాదం



ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. సీజేపీకి మద్దతుగా నిరసనలు తెలుపుతున్న విపక్ష నేతలను అరెస్టు చేశారు. సీజేపీ ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలో ఆంక్షలు విధించారు. అగ్రనేతలు మమతా బెనర్జీ, కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకోసం నిరసన తెలిపేందుకు ముంబయి నుంచి ఢిల్లీకి వచ్చిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు నిర్బంధించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనను విమానం నుంచే అదుపులోకి తీసుకోవడం గమనార్హం.

## ఎక్కడికక్కడ అరెస్టులు.. నిర్బంధాలు

## మొహరించిన 58 వేల మంది భద్రతా సిబ్బంది

## 7 వేల పైచీలుకు విద్యార్థుల అరెస్టు



- సీజేపీ నిరసనల పిలుపుతో దేశరాజధాని ఢిల్లీలో హై అలర్ట్
- విమానం నుంచే అభిజీత్ దీప్కే నిర్బంధం
- పలువురు రాజకీయ ప్రముఖులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రంగంలోకి పోలీసులు, ఆర్మీ, పింక్ ఫోర్స్

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలకు సిద్ధమైంది. ఇందుకోసం ముంబయి నుంచి ఢిల్లీకి వచ్చిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు నిర్బంధించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనను విమానం నుంచే అదుపులోకి తీసుకోవడం గమనార్హం. శనివారం ఉదయం ఢిల్లీలో విమానం ల్యాండ్ అవగానే.. పోలీసుల బృందం అందులోకి ప్రవేశించింది. ఈ దృశ్యాలను దీప్కే ఇన్‌స్టా లైవ్‌లో షేర్ చేశారు. అభిజీత్‌తో పాటు సీజేపీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాలను కూడా పోలీసులు నిర్బంధించారు. అనంతరం వీరిని రహస్య ప్రదేశానికి తీసుకెళ్లారు. ఈ పరిణామాలతో ఒకింత గందరగోళ పరిస్థితులు కనిపించాయి. విమానం దిగేవరకు

మిగతా 2లో..





నిరసన తెలిపేందుకు ముంబై నుంచి ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను ఏయిర్‌పోర్టులో విమానంలోనే అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## వెనక్కి తగ్గే ప్రసక్తేలేదు

**రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం • ఆందోళనలు ఆగవు : రాహుల్**



న్యూఢిల్లీ(జనంసాక్షి): దశాబ్ద కాలంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఆరెస్సెస్‌లతో తాను పోరాడుతూనే ఉన్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక ప్రత్యర్థిని ఎలాగైతే పూర్తిగా అర్థం చేసుకుంటారో.. తాను వారిని అలా అర్థం చేసుకున్నానని చెప్పారు. సీజేపీ నిరసనల నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. "మోదీ జీ.. మీకు నచ్చినట్లు చేయండి. పోలీసులందరినీ రంగంలోకి దించండి. 10 వేలు.. 20 వేలు.. 50 వేలు..

మిగతా 2లో..

## సీజేపీకి మద్దతుగా సుప్రీం లాయర్ల ర్యాలీ

అడ్డుకున్న పోలీసులు



నిరసనకారులను విడుదల చేయకపోతే

## నిరాహార దీక్ష లేదా పాదయాత్ర

అరెస్టులపై సోనమ్ వాంగ్‌చుక్ వార్నింగ్

2లో

## సీజేపీ ఆందోళనలకు జనం రాలేదట!

భాజపా నేతల వ్యాఖ్యలు



రేడియల్ రోడ్ల టెండర్లలో

# కుంభకోణం

**రూ.3,296 కోట్ల పనుల్లో నచ్చినవారికే కాంట్రాక్టులు**

- తక్కువ ధరకు బిడ్లు వేసినవారిని పక్కన పెట్టారు
- వందల కోట్ల ప్రజాధనానికి నష్టం..
- టెండర్లను రద్దు చేసి విచారణ జరపాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): రూ. 3,296 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రేడియల్ రోడ్-2 టెండర్ల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బుద్వేల్ నుంచి కొడంగల్

మిగతా 2లో..

ఎల్‌నినోను ఎదుర్కోవడానికి

# యాక్షన్‌ప్లాన్

**కరోనా తరహాలో ఎదుర్కోవాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. విద్యుత్ ఆధారిత పనులను తాత్కాలికంగా వాయిదా వేస్తే మంచిది. ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలి. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, వివిధ మాధ్యమాల ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాలి. నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి. చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి" - సీఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి): ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో శనివారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్ లో తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు నీరు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్

మిగతా 2లో..

- విద్యుత్ ఆధారిత పనులు వాయిదా వేయండి
- సాగునీరు పొదుపుగా వాడండి
- సమస్యలపై అవగాహన కల్పించాలి
- గ్రామస్థాయి నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలి
- చేతికొచ్చిన పంటలను కాపాడేందుకు చర్యలు చేపట్టండి
- తక్షణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష

## భారత ప్రధాని అంబానీ గారూ!..

- మీరు మీ దేశానికి నిజమైన బాస్ అని తెలుసుకోలేకపోయా..
- ఎలాన్ మస్క్ వ్యంగ్య వ్యాఖ్యలు
- భాజపా ప్రచారానికి రిలయన్స్ నిధులు..
- మీడియా కథనాలు షేర్ చేసిన స్పేస్ ఎక్స్ అధినేత

న్యూఢిల్లీ(జనంసాక్షి): స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు భారత్‌లో అనుమతుల జాప్యంపై స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తన మాటల దాడిని శుక్రవారం కూడా కొనసాగించారు. పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీని ఉద్దేశించి నేరుగా విమర్శలు సంధించారు. ఉపగ్రహ ఇంటర్నెట్ సేవల రంగంలో అంబానీ గుత్తాధిపత్యం సాధించి దానిని పరిరక్షించుకోవాలని యత్నిస్తున్నారని ఆరోపించారు. 'భారత ప్రధాన మంత్రి అంబానీ గారూ..' అని వ్యంగ్యంగా సంబోధించారు. ఏ రంగంలోనూ గుత్తాధిపత్యానికి భారత్ అంగీకరించబోదని, ఇప్పటికే మూడు కంపెనీలు

మిగతా 2లో..





## అలరించిన తరంగ్ శక్తి

**ఆకట్టుకున్న యుద్ధ విన్యాసాలు**

రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌లో తరంగ్ శక్తి 2026 పేరిట చేపట్టిన బహుళ దేశాల వైమానిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ విన్యాసాలను రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ఉన్నతాధికా రులతో కలిసి వీక్షించారు. భారత వాయుసేనతో కలిసి అమెరికాకు చెందిన ఐదోతరం ఎఫ్-35 ఫైటర్ జెట్లు యుద్ధ విన్యాసాలు చేపట్టడం ఇదే తొలిసారి. ఐఏఎఫ్‌కు చెందిన సారంగ్ హెలికాప్టర్ డిస్‌ప్లే టీమ్, సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పవర్ ఇన్ పార్ట్‌నర్ షిప్ అనే థీమ్‌తో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 12 వరకు జరుగుతున్న ఈ తరంగ్ శక్తి విన్యాసాలలో ఆస్ట్రేలియా, అమెరికా, యూఏఈ, జర్మనీ, ఫ్రాన్స్, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల వైమానిక దళాలు పాల్గొంటున్నాయి. ఉమ్మడి శిక్షణ, వివిధ దేశాల వైమానిక దళాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడమే ఈ విన్యాసాల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

- జోధ్‌పూర్ (జనంసాక్షి):

# ట్రంప్ కపటనీతి

**ఓవైపు బెదిరింపులు.. మరోవైపు రష్యాతో ఒప్పందం**



వాషింగ్టన్(జనంసాక్షి): రష్యాతో వాణిజ్య సంబంధాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరి అర్థం కాకుండా ఉంటోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో.. రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధిస్తామంటూ మొన్నటి వరకు హెచ్చరికలు చేసిన ఆయన తాజాగా మాట మార్చారు. రష్యాపై ఆంక్షలు సడలించిన ఆయన.. ఏకంగా ఆ దేశం నుంచే డీజిల్ కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఈ విరుద్ధ చర్యలు కొన్ని దేశాల పట్ల ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. రష్యా నుంచి

మిగతా 2లో..

## పైదుబాయ్ ఘటనపై ఎన్ఐఏ కేసు నమోదు

2లో..

## ప్రత్యేక డాలర్ విండో

రూపాయి పతనానికి ఆర్‌బీఐ అడ్డుకట్ట..



న్యూఢిల్లీ(జనంసాక్షి): రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రోజువారీ డాలర్ల అవసరం తీర్చేందుకు ప్రత్యేక డాలర్ విండోను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. దేశంలోని మూడు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు ఈ సదుపాయాన్ని కల్పించింది. ఈ విండో అక్టోబర్ 12 నుంచి అమల్లోకి రానుంది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఇది కొనసాగుతుందని ఆర్‌బీఐ పేర్కొంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ భారత్ పెట్రోలియం కార్పొరేషన్

మిగతా 2లో..

కెనడా మేయర్ బరిలో

## భారత సంతతి మహిళ..

తెలంగాణకు చెందిన దీపికా దామెర్ల పోటీ



ఒట్టావా(జనంసాక్షి): కెనడా స్థానిక ఎన్నికల్లో తెలుగు మహిళ బరిలోకి దిగారు. మిస్సిస్సాగా మేయర్ పదవికి దీపికా దామెర్ల పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓటర్లను ఆకర్షించేందుకు బాలీవుడ్ పాటతో ఆమె చేస్తోన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'వాడివేడిగా సాగిన మేయర్ డిబేట్ తర్వాత.. కాస్త ఉపశమనం కోసం..' అనే క్యాప్షన్‌తో దీపిక ఓ వీడియోను షేర్ చేశారు. ఇందులో బాలీవుడ్ సూపర్ హిట్ సాంగ్ 'క్యా హువా తేరా' లిరిక్స్‌ను కాస్త మార్చి.. "ఇది నా మాట.. నా ప్రమాణం.. నా కోరిక.. నేను మిస్సిస్సాగా మేయర్ అయిన రోజు నుంచి ఆస్తి పన్నులు

మిగతా 2లో..

## ప్రత్యేక డాలర్ విండో

సంస్థలకు ఆర్‌బీఐ ఈ వెసులుబాటు కల్పించింది. దేశీయ చమురు కంపెనీలు విదేశాల నుంచి ముడి చమురును డాలర్ల రూపంలో కొనుగోలు చేస్తుంటాయి. దీనివల్ల రోజూ వీరికి పెద్దఎత్తున డాలర్లు అవసరం. ఇకపై ఈ ప్రభుత్వ చమురు కంపెనీల రోజువారీ డాలర్ అవసరాలకు నిర్దేశిత బ్యాంకుల ద్వారా ఆర్‌బీఐ విదేశీ మారక నిల్వలను సమకూరుస్తుంది. దీంతో ఓపెన్ మార్కెట్‌లో డాలర్లను కొనుగోలు చేయాల్సిన అవసరం ఈ కంపెనీలకు తగ్గుతుంది.

## జెన్‌జీకి కావాల్సింది.. ఈ ఎమర్జెన్సీ కాదు:శశిథరూర్

దిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలకు పిలుపునిచ్చిన వేళ.. కేంద్ర ప్రభుత్వం విధించిన కఠిన ఆంక్షలను కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా ఖండించారు. రాజధానిలో భారీ సంఖ్యలో పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించడం, చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం, ఇంటర్నెట్‌ను నిలివేయడం వంటి చర్యలను తిరోగమన ధోరణిగా అభివర్ణించారు. ప్రస్తుత పరిస్థితులను అప్రకటిత ఎమర్జెన్సీతో పోల్చారు. జెన్‌జీ.. ఎమర్జెన్సీ కంటే మెరుగైన వాతావరణాన్ని కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల పారదర్శకతపై నమ్మకం ఉన్న ప్రభుత్వం.. ప్రశ్నలను స్వాగతించాలని సూచించారు. ఇప్పుడు యువతకు లాఠీలు కాదు.. జవాబులు కావాలన్నారు. రాజధానిని ఆంక్షల చట్రంలా మార్చడం వల్ల ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతాయన్నారు.

**యువతను ఆపలేరు: కేంద్రమంత్రి**

మరోవైపు, సీజేపీ నిరసనల వేళ కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రైళ్లను రద్దు చేయడం వంటి చర్యలతో దేశ యువతను ఎవరూ నిలువరించలేరన్నారు. "వీరంతా మన దేశ యువత. వారిని ఎవరూ అడ్డుకోలేరు. ఎన్ని రైళ్లను ఆపుతారు..? ఎన్ని రోడ్లను దిగ్బంధించడం సాధ్యమవుతుంది..? ప్రపంచానికి మార్గం చూపగల సత్తా మన యువతకు ఉంది. వారిని ఎవరూ ఆపలేరు. ఈ విషయంలో కొందరు తప్పుడు కథనాలను ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాంటి వారు (ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశించి) ఎన్నికల్లో గెలవట్లేదు కానీ.. నిరసనల పేరిట సామాన్య ప్రజలకు సమస్యలు సృష్టిస్తున్నారు" అని పాసవాన్ విమర్శలు చేశారు. ఎన్నికల సంఘంతో సమస్యలేమైనా ఉంటే.. ఎన్నికల కమిషనర్‌తో సమావేశం అవ్వాలి గానీ, ఇలా నిరసనలు చేయడం విడ్డూరమన్నారు.

**దిల్లీలో సీజేపీ నిరసనలు.. విమానం నుంచే అభిజీత్ దీప్కే నిర్బంధం**

చిరాగ్.. పాసవాన్ లోక్ జనశక్తి (రామ్ విలాస్) పార్టీ అధినేత. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలో ఈ పార్టీ భాగం. ఎన్నికల సంఘం లో సీఈసీ, ఇతర కమిషనర్ల మధ్య అసమ్మతి అంటూ వచ్చిన కథనాలపై గతంలో కూడా చిరాగ్ స్పందించారు.

# నిరసనగళంపై ఉక్కుపాదం

ఎందుకు ఆగలేదంటూ సీజేపీ సభ్యులు పోలీసులను ప్రశ్నించారు. " మేం బయటకు వచ్చే వరకు ఆగాల్సింది. రండి మమ్మల్ని అరెస్టు చేయండి. మేం భయపడ బోం" అని దీప్కే అక్కడున్న మహిళా పోలీసుల తో అన్నారు. దీప్కేను ఎయిర్‌పోర్టు వద్దే నిలు వరించేందుకు ముందుగానే ఐబీ, సీఐఎస్ఎఫ్, దిల్లీ పోలీసులు అక్కడ మోహరించడం గమ నార్హం. అటు సీజేపీ లీగల్ హెడ్ రత్నా సింగ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 25 మందికిపైగా సిబ్బంది చుట్టుము ట్టి తనను నిర్బంధించారని రత్నా సింగ్ ఒక వీడియో మెసేజ్‌లో పేర్కొన్నారు. కాగా.. నిరసనలకు ముందు సీజేపీ 12 పాయింట్లతో ఆందోళనకారులకు మార్గ దర్శకాలను విడుదల చేసింది. "మన నిరసన, మన బాధ్యత. శాంతియుతంగా, అప్రమత్తంగా, ఐక్యంగా ఉండండి" అని పేర్కొంది. ఎటువంటి ఘర్షణలకు దిగొద్దని, విద్వేష వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించింది. ఆస్తులకు నష్టం చేకూర్చొద్దని కోరింది. రాళ్లు విసరడం, నిప్పుపెట్టడం, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి కార్యాకలాపాలకు దిగితే ఆందోళనల ఉద్దేశం దెబ్బతింటుందని హెచ్చరించింది. చట్టపరమైన ఆదేశాలను పాటిస్తూ.. నిషేధిత ప్రాంతాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చింది.

**సరిహద్దుల్లో మేకులపట్టీ.. రంగంలోకి పింక్ ఫోర్స్**

దేశ రాజధాని దిల్లీ హైఅలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఉపసంహరణ డిమాండ్లతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ శనివారం నుంచి నిరసనలకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన ఇన్‌ఫ్లూయెన్సర్ ధ్రువ్ రాఠీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ నిరసనలకు దేశవ్యాప్తంగా 7వేల మంది రావొచ్చని అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో దిల్లీ సరిహద్దులో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. వాహనాల రాకపోకలను కట్టడి చేసేందుకు దిల్లీ-బదర్‌పూర్ సరిహద్దులో మేకుల పట్టీలను పరిచారు. నోయిడా-దిల్లీ సరిహద్దులోని చిల్లా చెక్‌పాయింట్ వద్ద ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. డ్రోన్లు, నైట్ విజన్ బాడీ కెమెరాలతో భద్రతా సిబ్బంది పహారా కాస్తున్నారు. గత ఆందోళనల్లో దురుసు ప్రవర్తనలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ప్రత్యేకంగా పింక్ ఫోర్స్‌ను రంగంలోకి దింపారు. ఇందులో అందరూ మహిళా సిబ్బందే ఉంటారు. ఇక, నిరసనల నేపథ్యంలో 250 రైళ్లు రద్దు అయ్యాయి. రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు రీఫండ్ పొందొచ్చని ఐఆర్‌సీటీసీ వెల్లడించింది. 45 మెట్రో స్టేషన్లను మూసివేశారు. ప్రయాణికులకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు రాజధాని నగరంలోని కోర్టుల్లో కార్యకలాపాలు వర్చువల్‌గా నడుస్తున్నాయి. న్యాయవాదులు/వ్యాజ్యదారులు వ్యక్తిగతంగా హాజరుకాలేకపోతే.. ఎలాంటి ప్రతికూల ఉత్తర్వులు జారీ చేయవద్దని హైకోర్టు తమ ఆదేశాల్లో పేర్కొంది.

**దీదీని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. సీజేపీకి మద్దతుగా నిరసనలు తెలుపుతున్న విపక్ష నేతలను కట్టడి చేస్తున్నారు. ఈ క్రమంలో సౌత్ అవెన్యూలోని ఓ బస్టాప్ వద్ద నిరసన తెలుపుతున్న టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ సహా ఆమె పార్టీ నేతలు డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు వాహనంలో అక్కడి నుంచి తరలించారు. ఏఐఎస్‌ఏ చీఫ్ నేహా బోరా, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్యతోపాటు సామాజిక కార్యకర్తలు ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్‌లను ఐఎన్‌ఏ మార్కెట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. **పోలీసుల అదుపులో కేజ్రీవాల్..**

సీజేపీ పిలుపు మేరకు నిరసనలో పాల్గొనేందుకు ప్రయత్నించిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంటి నుంచి జంతర్ మంతర్‌కు ర్యాలీగా వెళ్తున్న సమయంలో అడ్డుకొని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

## సీజేపీ ఆందోళనలకు జనం రాలేదట!

న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీ నగరాన్ని దిగ్బంధనం చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' పిలుపునిచ్చిన నిరసన 'ఫ్లాప్ షో'గా ముగిసిందని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర పేర్కొన్నారు. ఇది మూకస్వామ్యంపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమని తెలిపారు. భాజపా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈమేరకు మాట్లాడారు.

**ఈసీకి మద్దతుగా.. 124 మంది విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌ల బహిరంగ లేఖ**

ఎన్నికల సంఘం నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. ఈసీకి మద్దతుగా 124 మంది విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్, అనుబంధ సర్వీసుల అధికారులు బహిరంగ లేఖ రాశారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియనూ సమర్థించారు. ఎటువంటి విశ్వసనీయ ఆధారాలూ లేకుండా ఓట్ల రిగ్గింగ్ ఆరోపణలు చేయడాన్ని వారు తప్పుపట్టారు."ఒకప్పుడు బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ బాక్సుల ట్యాంపరింగ్, ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలు వంటివి జరిగేవి. ఆ చీకటి రోజులను దాటుకుని భారత్ ఎంతో మార్పు చెందింది. నేటి ఎన్నికల వ్యవస్థలో పోలింగ్ ఏజెంట్లు, ఈవీఎం సీలింగ్, స్ట్రాంగ్ రూమ్ భద్రత, వీవీప్యాట్ వెరిఫికేషన్ వంటి బహుళ అంచెల తనిఖీ, రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. గెలిచినప్పుడు ఎన్నికల వ్యవస్థ నిజాయతీని పేర్కొని.. ఓడిపోయినప్పుడు రిగ్గింగ్ ఆరోపణలు చేయడం తగదు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా.. ఇదే ఈసీ ఆధ్వర్యంలో పలు రాష్ట్రాల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఓడిపోయింది. 2024 ఎన్నికల్లో పార్లమెంటులో తన మెజారిటీని కూడా కోల్పోయింది" అని గుర్తుచేశారు.

## వెనక్కి తగ్గే ప్రసక్తేలేదు

ఇలా ఎంతమందినైనా సరే. నాయకులందరినీ.. యువతను.. ఇలా అందరినీ అరెస్టు చేయండి. కానీ.. మేమంతా మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం. దేశ ప్రజల గొంతుకను రక్షించుకుంటాం. గత 10-15 ఏళ్లలో దేశానికి జరిగిన అన్యాయం ఇక ఎప్పటికీ జరగకుండా చూస్తాం. ఈ ప్రభుత్వాన్ని, రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించేలా కృషి చేస్తాం" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

## సీజేపీకి మద్దతుగా సుప్రీం లాయర్ల ర్యాలీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీజేపీకి మద్దతుగా నిరసన తెలిపిన సుప్రీంకోర్టు న్యాయవాదులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై బార్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయవాదుల నిర్బంధాన్ని సహించమని ఎస్‌సీబీఏ ప్రెసిడెంట్ ప్రదీప్ రాయ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకోవడంతో సుమారు 60 మంది లాయర్లను పోలీసులు విడుదల చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ సీజేపీ దిల్లీలో శనివారం ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే సీజేపీకి మద్దతుగా సుప్రీంకోర్టు న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేపట్టారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి జంతర్‌మంతర్‌కు ర్యాలీగా వెళ్తున్న లాయర్లను ఉదయం పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు.. ఈ వార్త చదివారా: దిల్లీలో సీజేపీ నిరసనలు.. విమానం నుంచే అభిజీత్ దీప్కే నిర్బంధం

## నిరసనకారులను విడుదల చేయకపోతే నిరాహార దీక్ష లేదా పాదయాత్ర

న్యూఢిల్లీ(జనంసాక్షి):సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా దిల్లీలో శనివారం జంతర్ మంతర్ 2.0 పేరుతో ప్రతిపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అనుమతి లేదనే కారణంతో దిల్లీ పోలీసులు దాదాపు 7000 మంది నిరసనకారులను, సీజేపీ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే సీజేపీ, ప్రతిపక్ష నేతలు చేపట్టిన నిరసనలపై పోలీసుల చర్యలను ప్రముఖ సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ తీవ్రంగా విమర్శించారు. నిరసనల్లో అరెస్ట్ అయిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సహా ఇతరులను ఆదివారం నాటికి విడుదల చేయకపోతే తాను నిరాహార దీక్ష లేదా పాదయాత్ర చేపట్టాల్సి వస్తుందని, ఆ విషయాన్ని పరిశీలిస్తానని హెచ్చరించారు. దేశంలో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ (అన్‌డిక్లేర్డ్ ఎమర్జెన్సీ) పరిస్థితులు నెలకొన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న దిల్లీ జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనలకు పిలుపునిచ్చిన

## షైదుబాయ్ ఘటనపై ఎన్ఐఏ కేసు నమోదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇటీవల షైదుబాయ్ విమానంలో కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై జరిగిన దాడి ఘటనపై 'జాతీయ దర్యాప్తు సంస్థ' కేసు నమోదు చేసింది. యాంటీ హైజాకింగ్ చట్టం-2016, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నేరం తీవ్రతను, దాని వెనుక దాగి ఉన్న కుట్రను వెలికితీయాల్సిన అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని.. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన విమానం కాక్‌పిట్‌లో స్మిత్ మచ్చుర్‌పై కోపైలట్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఇజ్రాయెల్‌లు ఈ ఘటనపై వేర్వేరుగా దర్యాప్తు చేస్తున్నాయి.

## కెనడా మేయర్ బరిలో తెలంగాణ మహిళ..

పెరగవు" అని సరదాగా పాడుతూ ఓటర్లతో పాటు, నెటిజన్లను ఆకట్టుకుం టున్నారు. గతంలో న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో జోరాన్ మమ్దానీ కూడా ఇలాగే సినిమాటిక్ స్టైల్‌లో ప్రచారం చేయగా, ఇప్పుడు దీపిక అదే బాటలో నడిచి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.దీపికా దామెర్ల తెలంగాణలోని సికింద్రాబాద్‌లో జన్మించారు. తండ్రి ఆర్మీలో సేవలందించారు. అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత 1991లో కెనడాకు వెళ్లారు. టొరంటో విశ్వవిద్యాలయంలోని రొట్మాన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఆమె ఎంబీఏ పూర్తి చేశారు. ఆ తర్వాత కెనడాలోని ప్రముఖ బ్యాంకులలో కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. టీవీ జర్నలిస్టుగానూ సేవలందించిన ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2018లో మిస్సిస్సాగాలోని ఏడో వార్డుకు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు ఆ సమయంలో ఒంటారియో అసోసియేట్ ఆరోగ్య, దీర్ఘకాలిక సంరక్షణ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

# ట్రంప్ కపటనీతి

ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా అగ్రస్థానంలో ఉండగా.. భారత్, తుర్కియే, ఈయూ సహా పలు దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ఇలా చేయడం వల్ల మాస్కో ఆర్థికంగా బలపడుతోందని.. తద్వారా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తోందని అమెరికా వాదిస్తోంది. ఈ క్రమంలోనే ఆయా దేశాలపై సుంకాల మోత మోగించింది. భారత్‌పైనా 25శాతం అదనపు సుంకాలు విధించింది. భారత్‌తోనే కాదు, ఇతర దేశాలతోనూ ట్రంప్ ఇదే వైఖరి అవలంబించారు. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై వంద శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని ప్రభుత్వానికి కల్పిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు.

**జాతీయ ప్రయోజనాలే ముఖ్యం..**

అంతర్జాతీయంగా సంఘర్షణలు, భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఇంధన దిగుమతులపై భారత్ సరికొత్త వ్యూహం అమలు చేస్తోంది. రష్యా, యూఏఈ, వెనెజువెలా, ఒమన్, బ్రెజిల్, ఇరాన్ నుంచి కొనుగోళ్లపై దృష్టి సారించింది. ట్రంప్ హెచ్చరికలను పక్కనపెట్టింది. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చమురు కొనుగోలు చేస్తామని, చౌకగా ఎక్కడ లభిస్తే అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటామని పలుమార్లు స్పష్టం చేసింది. చమురు విషయంలో భారత్‌ను విమర్శిస్తున్న దేశాలే రష్యాతో వాణిజ్యం చేస్తున్నాయని (పాశ్చాత్య దేశాలను ఉద్దేశిస్తూ) విదేశాంగ మంత్రి జైశంకర్ ఓ సందర్భంలో ఘాటుగా వ్యాఖ్యానించడం విశేషం.

**అమెరికాలో విమర్శల నేపథ్యంలో..**

ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా ఇంధన ధరలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. చమురు నౌకలపై దాడులతోనూ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీంతో అమెరికాలోనూ డీజిల్ ధర రికార్డు స్థాయికి (గ్యాలన్‌కు 6డాలర్లు) దాటింది. స్థానికంగా రైతులు, ట్రక్కు యజమానులతోపాటు అన్ని వర్గాలపై ఇంధన భారం పడుతుండడంతో అధ్యక్షుడిపై విమర్శలు ఎక్కువయ్యాయి. దీంతో ఇంధన ధరలు తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో యూటర్న్ తీసుకున్న ట్రంప్.. రష్యా డీజిల్‌పై ఆంక్షలను (2027 ఏప్రిల్ వరకు) ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. అక్కడి నుంచి డీజిల్ కొనేందుకు ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. మధ్యంతర ఎన్నికల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నారనే వాదన ఉంది. మొత్తంగా రష్యా చమురు విషయంలో ఆయా దేశాలను హెచ్చరిస్తున్న ఆయన.. సొంత విషయానికి వచ్చేసరికి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

# ఎల్‌నినోను ఎదుర్కొవడానికి యాక్షన్‌ప్లాన్

రూ పొందించాల్సిం దేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్ లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కో వడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**రాబోయే 8 నెలలు కీలకం**

రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవ డంలో కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. ఈ ఎనిమిది నెలలు ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకుపకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, కానీ మార్కెట్ లో విద్యుత్ అందుబాటులో లేదన్నారు.అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనావేసి పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్ లో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తు చేశారు. వీబీజీరాంజీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సీఎం సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తరువాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా , రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎప్పటికపుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు సిఎంఓ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో న ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపి వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్ల టెండర్లలో కుంభకోణం!

సమీపంలోని జాతీయ రహదారి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి చేపట్టిన టెండర్లలో తీవ్ర అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. పనులను ప్యాకేజీలుగా విభజించి, ముందుగా నిర్ణయించుకున్న సంస్థలకే కట్టబెట్టారనే అనుమానాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలను పక్కనపెట్టి, ఎక్కువ ధరలకు కోట్ చేసిన సంస్థలకు పనులు కేటాయించడంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.బుద్వేల్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్-167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి మూడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని కేటీఆర్ పేర్కొన్నారు. 2026 సెప్టెంబర్ 30తో బిడ్ల దాఖలు గడువు ముగియగా, అక్టోబర్ 8 నాటికే సాంకేతిక మూల్యాంకనం, బిడ్డర్ల అర్హతల పరిశీలన, ఆర్థిక బిడ్ల పరిశీలన, కేటాయింపుల ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారని తెలిపారు. సెలవులను మినహాయిస్తే కేవలం ఐదు పని దినాల్లోనే రూ.3,296 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్ల పరిశీలన, అర్హతల నిర్ధారణ, కేటాయింపుల ప్రక్రియ ఎలా పూర్తిచేశారని ప్రశ్నించారు. ప్రతి సంస్థ సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారా? నిర్ణయాలకు అవసరమైన ఆధారాలను నమోదు చేశారా? అన్నది ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.ప్యాకేజీ-1ను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు రూ.1,286.03 కోట్లకు కేటాయించినట్లు, ఇది అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికమని సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. ప్యాకేజీ-2 బీవీఎస్‌ఆర్‌కు, ప్యాకేజీ-3 జీకేసీకి దక్కినట్లు పేర్కొన్నారని తెలిపారు. అయితే మిగిలిన ప్యాకేజీలకు సంబంధించిన పూర్తి ఆర్థిక వివరాలు ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. ప్రతి ప్యాకేజీకి ఎన్ని సంస్థలు బిడ్లు వేశాయి? ఎన్ని అర్హత సాధించాయి? ఏ సంస్థ ఎంత ధర కోట్ చేసింది? అంచనా వ్యయంతో పోలిస్తే తుది కేటాయింపు ఎంత ఎక్కువగా ఉంది? అనే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా?

**గజ్వేల్ ఎమ్మార్వో తీరుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం..**

**అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



హైదరాబాద్(జనంసాక్షి):రైతులకు అన్నం పెట్టే అన్నదాతల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరిస్తారా? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యవసాయ భూమిని, జీవనాధారాన్ని కాపాడుకోవాలని గజ్వేల్ ఓఖీూ కార్యాలయానికి వెళ్లిన రైతును అధికారి అవమానించిన తీరు సిగ్గుచేటని, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడ్డారు. రైతు సమస్యను పరిష్కరించాల్సిన అధికారి.. అతడి బాధను ఎగతాళి చేయడం దారుణమని పేర్కొన్నారు.తన భూమిని కాపాడుకోవడానికి సాయం కోరిన రైతును "ఇంకా పురుగుల మందు తాగలేదా? ఇంకా బతికే ఉన్నావా?" అంటూ అధికారి ప్రశ్నించినట్లు వెలుగులోకి వచ్చిన వీడియోపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తన బాధను చూసి కూడా ఎగతాళి చేస్తారా అని రైతు ప్రశ్నించగా, అధికారి "అవును.. ఖచ్చితంగా" అని సమాధానమిచ్చినట్లు వీడియోలో కనిపిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటి మనిషి పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరించాలంటే ఎంతటి నిర్దయతో ఉండాలని ప్రశ్నించారు."మనకు అన్నం పెట్టే రైతులను ఇలాగేనా మనం చూసుకునేది? తోటి మనిషితో ఈ అధికారి వ్యవహరించిన తీరు చూస్తే, ఆయన మానసికంగా ఎంతటి అమానవీయ స్థితిలో ఉన్నారో అర్థమవుతోంది. ఇది సిగ్గుచేటు.. ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## భారత ప్రధాని అంబానీ గారూ!..

లైసెన్సులు పొందాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే మస్క్ స్పందించారు.

**మీరు నిజమైన బాస్ అని తెలుసుకోలేకపోయా..**

"డియర్ ప్రైమ్ మినిస్టర్ అంబానీ, భారత దేశానికి మీరు నిజమైన బాస్ అని తెలుసుకోలేకపోయి నందుకుగాను నా క్షమాపణలను అంగీకరించండి. భారత్ వంటి గొప్ప దేశ ప్రజలను దోచుకోవడంలో మీ గుత్తాధిపత్యం కొనసాగాలనే కదా మీరు సహజంగా కోరుకుంటారు. అలాంటప్పుడు స్టార్ లింక్‌ను భారత్‌లో పోటీకి అనుమతించడాన్ని పరిగణిస్తారా?" అంటూ రాసుకొచ్చారు. పలుదేశాల్లో మాదిరిగా భారత్‌లోనూ అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో లేదని పేర్కొన్నారు. అటువంటి ప్రాంతాల్లోని ప్రజల జీవితాలను స్టార్‌లింక్ మెరుగుపరచగలదని తెలిపారు. ఆ వెంటనే మరో పోస్టులో ..'ప్రకృతివిపత్తుల సమయంలోనూ సేవలు అందించగలదని ప్రపంచవ్యాప్తంగా స్టార్‌లింక్ నిరూపించుకుంది' అని పేర్కొన్నారు. ప్రభుత్వంపై గట్టిపట్టున్న సంపన్న వర్గాలు కొన్ని భారత్‌లోకి స్టార్‌లింక్ ప్రవేశించకుండా అడ్డుకుంటున్నాయని ఎలాన్ మస్క్ గురువారం ఆరోపించిన విషయం తెలిసిందే. అదే సమయంలో 'అంబానీయే భారత దేశానికి నిజమైన బాస్' అంటూ ఆక్షేపించారు.

భాజపా ప్రచారానికి రిలయన్స్ నిధులు..

స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు భారత్‌లో అనుమతుల జాప్యంపై టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ (ఇక్రీనీని ఓబీబని) తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. గతంలో వచ్చిన కొన్ని మీడియా కథనాలను తాజాగా ఎక్స్‌వేదికగా షేర్ చేసిన ఆయన.. భాజపా, రిలయన్స్ సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. భాజపా ప్రచారానికి రిలయన్స్‌కు సంబంధించిన 'క్విక్ సప్లయ్' గతంలో నిధులిచ్చిందన్నది ఆ కథనాల సారాంశం. అయితే, క్విక్ సప్లయ్ కంపెనీతో తమకు ఎలాంటి సంబంధం లేదని గతంలోనే రిలయన్స్ తేల్చిచెప్పింది.ఎలాన్ మస్క్ షేర్ చేసిన పోస్టులో గతంలో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'అల్ జజీరా' మీడియా సంస్థల్లో వచ్చిన కథనాలు ఉన్నాయి. 'రిలయన్స్ అనుబంధంగా ఉన్న క్విక్ సప్లయ్ ఎన్నికల బాండ్ల ద్వారా భాజపాకు రూ.385 కోట్లు, శివసేనకు రూ. 25 కోట్లు విరాళంగా ఇచ్చింది' అని 2024లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రాసుకొచ్చింది. అల్‌జజీరా కథనం కూడా ఆ తరహాలోనిదే. ఇప్పటికే రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని ఉద్దేశించి మస్క్ నేరుగా విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. 'భారత ప్రధాన మంత్రి అంబానీ గారూ..' అని వ్యంగ్యంగా సంబోధించారు. మస్క్ విమర్శలపై రిలయన్స్ నుంచి ప్రస్తుతానికి ఎలాంటి స్పందన రాలేదు. కానీ గుత్తాధిపత్యం వ్యాఖ్యలను భారత ప్రభుత్వం ఇప్పటికే ఖండించింది. రంగం ఏదైనా.. భారత్ ఎప్పుడూ గుత్తాధిపత్యాన్ని అనుమతించబోదని తేల్చిచెప్పింది. అన్ని శాటిలైట్ కమ్యూనికేషన్స్ (శాట్‌కామ్) కంపెనీలకు ఒకే రకమైన నియంత్రణ, భద్రతా నిబంధనలు అమలు చేస్తామని స్పష్టం చేసింది. మస్క్ ఆరోపణలు అర్థరహితమని తోసిపుచ్చింది. భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను అందించడానికి ఎలాన్‌మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పాటు రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్, భారతీ ఎయిర్‌టెల్ మద్దతున్న వన్‌వెబ్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక లైసెన్సులు జారీ చేసింది.

## దిల్లీలో నిరసనల వేళ.. విజయ్‌తో రాహుల్ భేటీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ శనివారం తమిళనాడులో పర్యటించారు. టీవీకే చీఫ్, ముఖ్యమంత్రి విజయ్‌తో భేటీ అయ్యారు. విజయ్ నివాసంలో ఈ సమావేశం జరిగిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.విజయ్-రాహుల్ గంటపాటు పలు రాజకీయ అంశాలపై చర్చించారు. తర్వాత వారిద్దరు కలిసి సమీపంలోని కేఫ్‌కు వెళ్లారు. ఈ భేటీ అనంతరం రాహుల్ హోటల్‌కు వెళ్లిపోయారు. సాయంత్రం చెన్నైలోని ఐలాండ్ గ్రౌండ్స్‌లో జరగనున్న 'ఛాత్రో కీ గూంజ్' కార్యక్రమంలో పాల్గొననున్నారు .కొన్నిరోజులుగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమి విపక్ష నేతలు దేశ రాజధాని దిల్లీలో నిరసనలు చేస్తున్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారంతా పట్టుబడుతున్నారు. ఈ ఆందోళనలకు రాహుల్ నేతృత్వం వహిస్తున్నారు. టీవీకే పార్టీ ఇండియా కూటమిలో భాగమైనప్పటికీ.. దిల్లీలో నిరసనల విషయంలో మాత్రం దూరంగానే ఉంటూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే విజయ్‌తో రాహుల్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



# కరెంటు కోతలకు నిరసనగా ధర్నా



**బెల్లంపల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలంలోని శివాలయం సబ్ స్టేషన్ ముందు శనివారం పెర్కపల్లి, బట్వాన్ పల్లి, దుగ్నేపల్లి గ్రామాలకు చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. రైతాంగానికి 24 గంటల నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సందర్భంగా రైతులు మాట్లాడుతూ బెల్లంపల్లి మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోవడమే కాకుండా మోటార్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో పోరాటాన్ని ఉధృతం చేయడమే కాకుండా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బట్వాన్ పల్లి సర్పంచ్ సింగతి రాజేష్, పెర్కపల్లి మాజీ కో ఆప్షన్ సభ్యుడు రామగౌని అశోక్ గౌడ్, రైతు సంఘం నాయకుడు సింగతి రవి, బట్వాన్ పల్లి, పెర్కపల్లి, దుగ్నేపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బేబీ రుక్సానా ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బేబీ రుక్సానా ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. మంత్రి ఆదేశాలతో ఆయన కార్యాలయ అధికారులు శనివారం ఉదయం గాంధీ హాస్పిటల్‌కు వెళ్లి పాప, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్ ఉషారాణితో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పాప ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పాపకు పుట్టుకతోనే పెద్ద పేగు సమస్య ఉందని, ఈ సమస్యకు పాప పుట్టినప్పుడే నీలోఫర్‌లో సర్జరీ చేశారని ఉషారాణి తెలిపారు. ఇటీవలే గాంధీలో పాపకు మరో సర్జరీ జరిగిందని, మరో 3 నెలల తర్వాత ఇంకొక సర్జరీ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. పాపకు చికిత్స విషయంలో ఎలాంటి సమస్య లేదన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. కుటుంబ కలహాలు, ఆర్థిక పరిస్థితుల వల్లే రుక్సానా తల్లి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నదని ఉషారాణి తెలిపారు. కుటుంబ పరిస్థితులు, సరియైన ఉపాధి లేకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాప తల్లి మంత్రి కార్యాలయ అధికారులకు తెలిపారు. భర్త వదిలేసి వెళ్లిపోయాడని, అద్దె ఇంట్లో ఉంటూ, దొరికిన పని చేసుకుంటూ తానే ఇద్దరు ఆడపిల్లల్ని పోషించుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఉపాధి కల్పించాలని ఆమె కోరగా, ఈ విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించారు. పాప తల్లికి గాంధీ హాస్పిటల్‌లోనే, ఆమె అర్హతకు తగిన ఉద్యోగం కల్పించాలని సూపరింటెండెంట్ ఉషారాణికి సూచించారు. పాపకు గాంధీలోనే పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. రుక్సానా తల్లికి వారం రోజుల్లో ఉద్యోగం కల్పిస్తామని ఉషారాణి వెల్లడించారు.

# లలిత కళా తోరణంలో బతుకమ్మ వేడుకలు

- పాల్గొన్న మంత్రులు జూపల్లి, పొన్నం
- బతుకమ్మ పాటలను ఆవిష్కరించిన మంత్రులు



**హైదరాబాద్ (జనసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు నగరంలో సందడిగా సాగుతున్నాయి. పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళా తోరణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ సమర్పణలో ప్రత్యేకంగా రూపొందించిన బతుకమ్మ పాటలను మంత్రులు ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా ఈ పాటలను రూపొందించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం

- బాలిక మృతి.. మృతదేహాన్ని అప్పగించాలని డిమాండ్
- బాధితుల ధర్నా
- ఇందిరా చౌక్ సెంటర్లో భారీగా నిలిచిపోయిన వాహనాలు



**హుజూర్‌నగర్ అక్టోబర్ 10 (జనంసాక్షి):** హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలైంది. సాధారణ జ్వరంతో ఆస్పత్రిలో చేరిన 12 ఏళ్ల బాలిక సరైన చికిత్స అందక మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే... హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని చింతలపాలెం మండలం నక్కగూడెం గ్రామానికి చెందిన మాలోతు సైదా,సుజాత దంపతుల కుమార్తె మాలోతు మల్లీశ్వరి (12) కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో కుటుంబసభ్యులు బాలికను అక్టోబర్ 6వ తేదీన హుజూర్ నగర్ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చి చేర్పించారు. శనివారం డిశ్చార్జ్ చేస్తామని చెప్పిన వైద్యులు ఆ క్షణంలోనే బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్ళడం పరీక్షించిన వైద్యులు సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేయడంతో హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు బాలిక మృతి చెందినట్లు తెలిపారు. హుజూర్‌నగర్ ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి వైద్యులు సరైన రీతిలో పర్యవేక్షించలేదని, చికిత్సలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కళ్లముందే ఆడుతూ పాడుతూ తిరిగిన చిన్నారి మృతి చెందటంతో నక్కగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. తమ బిడ్డ మరణానికి కారణమైన హుజూర్ నగర్ ఏరియా ఆస్పత్రి వైద్యులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# రూ.10 నాణేలతో బైక్ కొనుగోలు



**లక్షెట్టిపేట అక్టోబర్ 10 (జనంసాక్షి) :** లక్షెట్టిపేటకు చెందిన బొడ్డు రవి జోసఫ్ రూ.1.23 లక్షల విలువైన స్కూటీని 10-10-26 శనివారం నాడు 10:10 నిమిషాలకు పూర్తిగా 10 రూపాయల నాణేలతో హోండా యాక్టివా స్కూటీని కొనుగోలు చేశారు. పది రూపాయల నాణేలు చూసిన షాపు యజమాని ఒక్కసారిగా షాక్ తిన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పనుల రీత్యా బయటకు వెళ్ళినప్పుడు కూరగాయలు, నిత్యవసర సరుకులు కొనుగోలు చేసినప్పుడు పది రూపాయల నాణేలు వచ్చేవి మూడు సంవత్సరాల కాలంలో ఈ నాణేలను పోగుచేశామన్నారు. తనలాగే బైక్ కొనలేని వాళ్లు ఇలా నాణాలతో కూడా కొనుగోలు చేయవచ్చని తెలిపారు. చాలాకాలంగా పొదుపు చేసిన ఈ నాణేలను చిన్న చిన్న సంచుల్లో షోరూమ్కు తీసుకెళ్లారు. షోరూమ్ సిబ్బంది గంటలపాటు లెక్కించి ఆయనకి బైక్ అందజేశారు.

# వంటింట.. ధరల మంట!

## నిత్యావసర ధరలకు రెక్కలు

- మండుతున్న కూరగాయల ధరలు
- పండగ పూట సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు భారం
- ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో మరింత భారం?
- ధరల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 10( జనం సాక్షి) :** వంటింటి సరుకుల ధరలు అమాంతం పెరగడంతో జనజీవనాన్ని తలకిందులు చేసింది. మొన్నటివరకు యుద్ధ ప్రభావంతో పలు రకాల ఉత్పత్తుల ధరలు నింగినంటడంతో ఇబ్బందులు పడ్డ మధ్యతరగతి జీవులపై తాజాగా ఎల్నినో ప్రభావం చూపుతోంది. నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడం తో సామాన్యుడి బడ్జెట్ తలకిందులవుతోంది. వంటింటి సరుకులు ధరలు అమాంతం పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనంపై పెను భారం పడుతోంది. ముఖ్యంగా బియ్యం, పప్పులు, పంచదార ధరలు అనూహ్యంగా పెరిగాయి. గతం లో 1250 రూపాయలు పలికే 25 కిలోల సన్న బియ్యం ధర ప్రస్తుతం రూ.1900కు చేరింది. ఒకేసారి ఈ స్థాయిలోయిలో ధరలు పెరగడంతో మధ్యతరగతి ప్రజలపై ఆర్థికభారం పడింది. మరోవైపు ఎల్నినో ప్రభావంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో సగానికి పైగా పంటలు లేకపోవడంతో భవిష్యత్ లో బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు రైసిమిల్లర్లు, వ్యాపారులు సైతం ఎల్నినో పేరుతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీంతో సామాన్యుడికి ధరల సెగ తగులుతోంది. వర్షాభావంతో నిత్యావసర ధరలు భగ్గుమంటు-న్నాయి. జూన్ నుంచి మొదలైన ధరల మంట ఆగస్టు నాటికి సెగలు రేపుతోంది. వర్షాభావ పరిస్థితులతో ఉత్ప త్తుల సరఫరా తగ్గుతుండగా.. ఇందన ధరల పెంపుతో రవాణా ఖర్చులు అధికమై మధ్యతరగతి, పేద కుటుంబాలపై మోయలేని భారం పడుతోంది.

### వర్షాభావమే ప్రధాన కారణమా?

తీవ్ర వర్షాభావం, ఎండల ప్రభావంతో కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గిందని రైతులు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో కూరగాయల సాగు తగ్గడంతో దిగుబడులు పడిపోయాయని పేర్కొంటున్నారు. ఫలితంగా స్థానిక మార్కెట్లలో సరఫరాకు, డిమాండ్కు మధ్య అంతరం ఏర్పడుతోందని వ్యాపార వర్గాలు చెబుతు న్నాయి. స్థానికంగా దిగుబడులు తగ్గడంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకురావాల్సి వస్తోంది. దీనికి తోడు రవాణా వ్యయం పెరగడం కూడా ధరలపై ప్రభావం చూపు తోందని వ్యాపారులు అంటున్నారు.

### ఠారెత్తిస్తున్న కూరగాయల ధరలు

ఇటీవల వరకు కిలో రూ.25 నుంచి రూ.30 మధ్య ఉన్న టమాటా ధర ఒక్కసారిగా పెరిగింది. గత వారం రూ.25గా ఉన్న ధర ఈ వారం రూ.60కు చేరింది. రెండు వారాల వ్యవధి లోనూ గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. దీంతో టమాటా కొనాలంటేనే వినియోగదారులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉల్లిపాయల ధర కూడా ఆగస్టు నుంచి తగ్గడం లేదు. పెద్ద సైజు ఉల్లిపాయలు కిలో రూ.70 చిన్న సైజు ఉల్లిపా యలు రూ.50 వరకు విక్రయిస్తున్నారు. కూరగాయల ధరల పట్టికలో చిక్కుడు, బీన్స్ ముందువ రుసలో ఉన్నాయి. కిలో రూ.120 వరకు విక్రయిస్తున్నారు. అల్లం కిలో రూ.170కు చేరింది. దొండకాయ, బెండకాయ, బీర కాయలు కిలో రూ.60 చొప్పున పలుకుతున్నాయి. క్యాబేజీ రూ.50, కాలీఫ్లవర్ రూ.60 వరకు విక్ర యిస్తున్నట్లు మార్కెట్ ధరలు చెబుతున్నాయి.

### ఉల్లి కోయకుండానే కన్నీళ్లు

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని నానుడి... అయితే ఉల్లి ధర ప్రస్తుతం ఆకాశాన్ని అంటుతుంది.. ఉల్లి కోస్తే కన్నీళ్లు వస్తాయి..కాని ఉల్లి ధర సామాన్య మధ్యతరగతి ప్రజలకు కన్నీళు తెప్పిస్తుంది. ఉల్లి ధర ప్రస్తుతం మార్కెట్లో 70 రూపాయలు పలుకుతుంది. మరి కొద్ది రోజుల్లో ఉల్లి ధర సెంచరీకి చేరబోతుందని అంటున్నారు. ఉల్లి ధరను నియంత్రించి ప్రజలకు ప్రభుత్వాలు మేలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలు కళ్లెం లేని గుర్రంలా గత కొంత కాలంగా దౌడు తీస్తుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. మరో వైపు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చోవడంతో సగటు వేతన జీవులు సైతం అల్లాడిపోతున్నారు. బియ్యం, వంట నూనెలతోపాటు ఉప్పు, పప్పు ధరలు దిగిరాకపోవడంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాల ప్రజలు అతలాకుతాలం అవుతున్నారు..

### ఎలా బతకాలి: రోజమ్మ, గృహిణి.. గంగ్వార్, మండలం న్యాల్ కల్



అన్నింటి ధరలూ పెరిగుతూ ఉంటే ఏం తిని బతకగలం. అసలెందుకు ఈ విధంగా ధరలు పెరు గుతున్నాయో అర్థం కావడం లేదు. పచ్చడితోనే అన్నం తిందామనుకున్నా చింతపండు కూడా కొని తినలేని ప రిస్థితి ఏర్పడింది.

### ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవాలి : భవాని, నారాయణఖేడ్



నిత్యావసర వస్తువుల ధరలు తగ్గేలా వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గత నెలలలో కిలో రూ.25 ఉన్న ఉల్లి గడ్డ ఇప్పుడు రూ.70 అంటున్నారు. అదే విధంగా నూనె, చింతపండు కూడా పెరిగిపోయాయి. దీంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది.

# కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భరోసా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్న ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి, వారి చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా స్వయంగా చొరవ తీసుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పనిగిరి గ్రామానికి చెందిన జంపాల మహేష్‌కుమార్, రజిత దంపతులిద్దరూ వినికిడి, మాటల సమస్యలతో బాధపడుతున్నారు. వారికి జన్మించిన బిడ్డ కూడా అదే సమస్యతో పుట్టడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చిన్నారికి సరైన వైద్యం అందిస్తే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రుల్లో ఆశ చిగురించింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ దంపతులు రెండు రోజుల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆశ్రయించారు. వారి ఆవేదనను అర్థం చేసుకున్న మంత్రి వెంటనే స్పందించి రూ.2 లక్షల తక్షణ ఆర్థికసాయం అందించారు. అంతటితో ఆగకుండా, చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులతో స్వయంగా మాట్లాడి అవసరమైన చికిత్స చేయిస్తానని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు మంత్రి చొరవ తీసుకుని హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రిలో చిన్నారిని చేర్పించి శస్త్రచికిత్స చేయించారు. శస్త్రచికిత్స పూర్తయిన అనంతరం మంత్రి ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని ఆప్యాయంగా పలకరించి,కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరో 2లక్షలు ఆర్థికసాయం అందజేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

### అమ్మ నాన్న లేని బాలికకు అండ

తల్లిదండ్రులను కోల్పోయి ఇబ్బందిపడుతున్న నిరుపేద బాలికకు తాను అండగా ఉంటానని,ఉన్నత చదువులకు అయ్యే ఖర్చునంతా భరిస్తానని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా, కట్టంగూర్ మండలం, చండూర్ గ్రామానికి చెందిన రాజగోపాల మనస్విని అనే బాలికకు తల్లితండ్రులు ఇద్దరూ లేకపోవడంతో, ప్రస్తుతం ఆమె పెద్దమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. ఈసందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బాలికతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడి, ఆమె యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

# దక్షిణాఫ్రికాలో బతుకమ్మ వేడుకలు..

- ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడి, పాడిన మంత్రి సీతక్క



**కేప్ టౌన్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికాలో నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడి, పాడారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటలతో వేడుకల్లో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై సైతం ఘనంగా చాటుతున్న ప్రవాస తెలంగాణ మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దేశ సరిహద్దులు దాటి విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం పట్ల మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలు ఎక్కడ ఉన్నా తమ మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకుండా బతుకమ్మ వంటి పండుగలను జరుపుకోవడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు ప్రవాస తెలంగాణ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడానికి దోహదపడ తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క వెంట వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి పాల్గొన్నారు. సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రవాస తెలంగాణ మహిళలు, ఇతర సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# మృతదేహమెక్కడ?



- అజాంనగర్ అడవిలో దారుణం.. రైతు మృతి..
- వన్యప్రాణుల వేటకు అమర్చిన విద్యుత్ తీగలే ప్రాణం తీశాయా?
- పోడు భూమి సాగుకు వెళ్లిన జడల అశోక్ అనుమానాస్పద మృతి
- కొంతమంది గుర్తించి సమాచారం ఇచ్చేలోపే అదృశ్యమైన మృతదేహం!
- కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన..
- పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా
- అడవిలో ఏం జరిగింది? మృతదేహం ఏమైంది? సమగ్ర విచారణకు డిమాండ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ మహాముత్తారం, (జనంసాక్షి):** భూపాలపల్లి మండలం అజాంనగర్, మహాముత్తారం గ్రామాల శివారు అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఓ రైతు అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. పోడు భూమిలో వ్యవసాయ పనుల కోసం అడవికి వెళ్లిన జడల అశోక్ (35) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు సమాచారం. వన్యప్రాణుల వేట కోసం అమర్చినట్లు భావిస్తున్న విద్యుత్ తీగలు తగిలి అశోక్ ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమికంగా ప్రచారం జరుగుతుండగా.. ఘటనను గుర్తించినట్లు చెబుతున్న కొంతమంది గ్రామానికి వెళ్లి సమాచారం అందించేలోపే మృతదేహం కనిపించకుండా పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒకవైపు అడవిలో మృతదేహం కోసం గాలింపు కొనసాగుతుండగా, మరోవైపు తమకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

### పోడు భూమికి వెళ్లి.. విగతజీవిగా మారి!

అజాంనగర్ గ్రామానికి చెందిన జడల అశోక్ శుక్రవారం రాత్రి పోడు భూమిలో వ్యవసాయ పనుల నిమిత్తం అజాంనగర్--నిమ్మగూడెం మధ్యనున్న అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కోసం అమర్చినట్లు అనుమానిస్తున్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురైనట్లు సమాచారం. ఈ ఘటనలోనే అశోక్ మృతి చెంది ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రమాదం జరిగిన తీరు, విద్యుత్ తీగలు ఎక్కడి నుంచి వచ్చాయి, వాటిని ఎవరు అమర్చారన్న విషయాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

### చెప్పిందొకటి.. అక్కడ కనిపించిందొకటి!

అశోక్ విద్యుదాఘాతానికి గురైన ఘటనను కొంతమంది గుర్తించినట్లు సమాచారం. వెంటనే గ్రామానికి వెళ్లి స్థానికులకు విషయం తెలియజేసినట్లు తెలుస్తోంది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే వారు అక్కడికి చేరుకునే సమయానికి అశోక్ మృతదేహం కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో అసలు ఏం జరిగిందన్న ప్రశ్నలు మొదలయ్యాయి. అశోక్ అక్కడికక్కడే మృతి చెంది ఉంటే మృతదేహం ఎక్కడికి వెళ్లింది? ఎవరైనా అక్కడి నుంచి తరలించారా? ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఏవైనా ఆధారాలు మాయమయ్యాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మృతదేహాన్ని ఎవరైనా తరలించినట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది.

### వేటగాళ్ల ఉచ్చులు.. మనుషుల ప్రాణాలకూ ముప్పేనా?

అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చుతున్నారన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వన్యప్రాణులను లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసే విద్యుత్ ఉచ్చులు అటవీ ప్రాంతానికి వెళ్లే రైతులు, పశువుల కాపరులు, ఇతర గ్రామస్తుల ప్రాణాలకూ ముప్పుగా మారే ప్రమాదం ఉంది. అశోక్ మృతికి విద్యుత్ తీగలే కారణమా? అయితే వాటిని ఎవరు అమర్చారు? విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి జరిగింది? ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. విద్యుత్ తీగలు అమర్చిన వారిని గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### మృతదేహం ఆచూకీపై ఉత్కంఠ!

ఈ ఘటనలో అత్యంత అనుమానాస్పదంగా మారిన అంశం మృతదేహం కనిపించకుండా పోవడమే. ప్రమాదం జరిగినట్లు చెబుతున్న ప్రాంతంలో అశోక్ మృతదేహం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అసలు అశోక్ మృతి చెందిన పరిస్థితులు ఏమిటి? మృతదేహం ఎక్కడ ఉంది? ప్రమాద స్థలంలో ఏం జరిగింది? అన్న విషయాలు తేలాల్సి ఉంది. మృతదేహం ఆచూకీ లభించకపోవడంతో ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో గాలింపు చేపట్టి, ఘటనాస్థలాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది.

అశోక్ మృతి, మృతదేహం కనిపించకుండా పోయిన ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తమకు న్యాయం చేయాలని, అశోక్‌కు ఏమైందో తేల్చాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని, మృతదేహాన్ని ఆచూకీ కనుగొనాలని వారు కోరుతున్నారు. తమ కుటుంబానికి జరిగిన అన్యాయంపై అధికారులు తక్షణమే స్పందించి స్పష్టత ఇవ్వాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అజాంనగర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో అనేక ప్రశ్నలు సమాధానాల కోసం ఎదురుచూస్తున్నాయి. విద్యుత్ తీగలే అశోక్ మృతికి కారణమా? వన్యప్రాణుల వేట కోసం ఉచ్చులు అమర్చిన వారెవరు? కొంతమంది గుర్తించినట్లు చెబుతున్న ఘటన తర్వాత మృతదేహం ఎలా కనిపించకుండా పోయింది? ఇందులో ఏదైనా నేరపూరిత కోణం ఉందా? అన్న అంశాలను పోలీసులు నిగ్గు తేల్చాల్సి ఉంది.

సంపాదకీయం

# భయపడిన అధికారం..

## ప్రజాస్వామ్యం గొంతు నొక్కేశారు

నిరసనను 'ఫ్లాప్ షో'గా అభివర్ణించిన భాజపా.. మరి ఆ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఇంతటి నిర్బంధం ఎందుకు? విమానాశ్రయాల్లోనే అరెస్టులు.. రాజధాని వీధుల్లో వేలాది మంది పోలీసుల మోహరింపు.. కేంద్ర హోంమంత్రి పర్యటనల రద్దు.. ఇవన్నీ దేనికి సంకేతాలు? నిజంగానే నిరసనకు ప్రజాదరణ లేదని పాలకులు భావిస్తే, దాన్ని స్వేచ్ఛగా జరగనిచ్చి ప్రజల తీర్పుకు వదిలేయవచ్చు కదా! నిరసనను బలహీనమైనదిగా కొట్టిపారేస్తూనే, దాన్ని అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని మొత్తం రంగంలోకి దింపడం పాలకులలోని అభద్రతాభావాన్ని బయటపెట్టడం లేదా? నిరసనకారుల బలాన్ని తక్కువ చేసి చూపుతూ, వారి గొంతులు బయటకు వినిపించకుండా చేయడంలోనే అధికార పక్షం అసలు ఆందోళన దాగి ఉంది.

విద్యార్థులు, యువత చేసిన నేరమేమిటి? తమ భవిష్యత్తు గురించి, తమ దేశం గురించి ప్రశ్నించడం. ప్రశ్నించడం రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన పాలకులు, ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. చర్చకు బదులు నిర్బంధం.. సమాధానానికి బదులు అరెస్టులు.. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనకు ప్రతిగా పోలీసు బలగాల మోహరింపు.. ఇవి ప్రజాస్వామ్య పాలనకు ఆరోగ్యకరమైన సంకేతాలు కావు. నిరసనను 'ఫ్లాప్'గా నిర్ణయించే హక్కు ప్రజలకు ఉంది. కానీ నిరసన జరగకుండా అడ్డుకుని, ఆ తర్వాత అది విఫలమైందని ప్రకటించడం అధికార దురహంకారానికి నిదర్శనం కాదా? గదికి తాళం వేసి, లోపల ఎవరూ లేరని ప్రకటించినట్లే కాదా ఈ వ్యవహారం?

ప్రతి అసమ్మతినీ 'విదేశీ శక్తుల కుట్ర'గా చిత్రించే ప్రయత్నం సమస్యను పక్కదారి పట్టించడమే. యువత ఆవేదనను విదేశీ కుట్రగా ముద్ర వేసినంత మాత్రాన వారి ప్రశ్నలు మాయమైపోవు. నిరుద్యోగం, భవిష్యత్తుపై ఆందోళన, పాలనా విధానాలపై అసంతృప్తి వంటి అంశాలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ అనుమానితులుగా చూడటం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచలేరు. దేశంలో నిజంగా ప్రశాంతత నెలకొని ఉంటే, ఆ ప్రశాంతతను నిరూపించుకోవడానికి నిరసనలను అడ్డుకోవాల్సిన అవసరం ఏముంది? భయంతో ఏర్పడిన నిశ్శబ్దాన్ని ప్రజల అంగీకారంగా భావించడం పాలకుల పొరపాటు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ఎంత ముఖ్యమో, ప్రభుత్వ విధానాలకు మద్దతు తెలిపే హక్కూ అంతే ముఖ్యం. ఈ రెండింటినీ కాపాడినప్పుడే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది. విద్యార్థులు, యువత లేవనెత్తే ప్రశ్నలకు జవాబులు చెప్పడం ప్రభుత్వ బాధ్యత. వారి నిరసనను అణచివేయడం కాదు, వారి ఆవేదనను వినడం పాలకుల కర్తవ్యం. నిర్బంధాలతో నిరసనను తాత్కాలికంగా నిలువరించవచ్చేమో గానీ, ప్రజల మనసుల్లోని ప్రశ్నలను చెరిపివేయలేరు. అధికార బలంతో గొంతులను నొక్కవచ్చు.. కానీ ప్రజాస్వామ్య ఆకాంక్షలను శాశ్వతంగా బంధించలేరు. చరిత్ర చెప్పే పాఠం ఇదే.

# రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలేవి?

**మృతుల్లో ఎక్కువగా 25 ఏళ్ల లోపు యువతి యువకులే చనిపోతున్నారు. రోడ్డు ప్రమాదాలలో యువకులు చనిపోవడం ఆందోళన కలిగిస్తుంది.. వరుస ప్రమాదాలు.. పట్టని అధికారులు మృత్యుకూపాలుగా మారుతున్న రహదారులు..**

## మలుపులో మృత్యు ఘోష.. చర్యలేవి



రోడ్లు. ప్రధాన రహదారులు మృతి కూపాలుగా మారుతున్నాయి.. ప్రమాదాలకు నిలయం. రోడ్లు టర్నింగ్ ప్యాంట్లు. యూటర్న్ లు. నిర్లక్ష్యం. అతివేగం ప్రమాదాలు.. పలువురు మృతి. మనం ఏ దినపత్రికలో చూసిన. ఏ టీవీ చానల్స్‌లో చూసినా. రోడ్డు ప్రమాదాలు. అని వినిపించే విషాద ఘటన వార్త. రోడ్డు ప్రమాదాలలో ఎంతోమంది ప్రమాదాల బారినపడి చనిపోవడం. శరీర అవయవాలను కోల్పోవడం. దీంతో జీవితాంతం నరకయాతన అనుభవిస్తున్నారు. రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్న ఘటనలు మనం చూస్తూనే ఉన్నాం నిత్యం... కొన్నిచోట్ల రోడ్లు సుందరంగా ఉండడం. కొన్నిచోట్ల రోడ్లు బాగుగా లేకపోవడం. గుంతలు ఉండడం. టర్నింగ్ లు. యూటర్న్లు. రోడ్లు దాటుతుండగా. అతివేగంగా వాహనాలను నడపడం. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం. ఇవన్నీయు రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కార్యకర్తమవుతున్నాయి. రాష్ట్రంలో 'జీరో ఫాటాలిటీ' లక్ష్యానికి క్షేత్రస్థాయిలో దూరంగా పరిస్థితులు

: రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం 'జీరో ఫాటాలిటీ' లక్ష్యంతో చర్యలు చేపడుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కుషాయిగూడ ప్రధాన రహదారి టర్నింగ్ ఇందుకు నిదర్శనంగా మారింది. ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టర్నింగ్ వద్ద వేగంగా వచ్చే ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంటున్నాయి. దీంతో పలువురు యువత ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల పీజీ విద్యార్థి మురళీకార్తీక్ (23) ఇదే ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. గతంలోనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇదే డివైడర్‌ను ఢీకొని ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. నెల రోజుల క్రితం ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది విరిగిపోయింది. కారులోని ప్రయాణికులకు గాయాలయ్యాయి.

**4ఈ విధానం అమలు ఎక్కడ?**

రోడ్డు ప్రమాదాల నివారణకు విద్య, ఇంజినీరింగ్, అమలు, అత్యవసర సహాయం అనే '4ఈ' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి రహదారి లోపాలను సరిదిద్దడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే కుషాయిగూడ టర్నింగ్‌లో మాత్రం తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పూర్తిస్థాయి చర్యలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

**మార్కెట్ వద్ద ట్రాఫిక్ తిప్పలు**

కుషాయిగూడ కూరగాయల మార్కెట్ వద్ద రహదారిపై చిరు వ్యాపారులు వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. టర్నింగ్ ప్రాంతంలో వాహనాల రద్దీ, ఆక్రమణలు, మలుపు కారణంగా వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం ప్రమాదాల ముప్పును మరింత పెంచుతోంది.

**అధికారులు స్పందించాలి**

రాష్ట్రంలో అధిక ప్రమాదాలున్న జిల్లాల్లో మేడ్చల్-మల్కాజిగిరి కూడా ఉండటంతో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కుషాయిగూడ టర్నింగ్‌ను ప్రమాదకర ప్రాంతంగా గుర్తించి డివైడర్‌ను పునర్వ్యవస్థీకరించడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రహదారి ఆక్రమణలను తొలగించడం, మార్కెట్ వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మరిన్ని ప్రాణాలు బలికాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు భారినపడి మరణాల సంఖ్య పెరిగిపోతుండడం. ఇందులో ముఖ్యంగా యువతి యువకులు ఉండడం ఆందోళన కలిగిస్తుంది. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 1.75 లక్షల మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏటా ₹7,000 మంది పైగా రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారని వివరించారు. రోడ్డు ప్రమాదాలలో తెలంగాణ రాష్ట్రం ఏడో స్థానంలో ఉండడం విశేషం.. సేఫ్ లైఫ్ ఫౌండేషన్ రూపొందించిన ప్రణాళికల్లో 2024.2025. ఈ. డార్ గణంకాలు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా. సంగారెడ్డి. వరంగల్లు. హనుమకొండ. మేడ్చల్. మల్కాజ్గిరి. రంగారెడ్డి. వికారాబాద్. జనగామ. సూర్యాపేట. ఆయా ప్రాంతాలలో ప్రమాద కారిడాలు. 6 మరణాల కంటే ఎక్కువ జరిగిన ప్రాంతాలలో 230 ప్రాధాన్య-1 . ప్రాంతాలు. 220 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు. 183 పాదచారుల ప్రమాద ప్రాంతాలను గుర్తించారు.. మరీ ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో 98 ప్రాధాన్య ప్రమాద ప్రాంతాలు..99 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు.66 ప్రమాద పాదచారుల ప్రాంతాలు ఉన్నట్లుగా వెల్లడించారు. మరి ముఖ్యంగా కుషాయిగూడ టర్నింగ్ పాయింట్ వద్ద. నాగారం. బండ్లగూడ. కీసర. ఘట్కేసర్. ఈసీఐఎల్. ప్రాంతాలలో తరచు రోడ్డు ప్రమాదాల బారినపడి 25 ఏళ్ల లోపు యువతి యువకులు మరణిస్తున్నారు. వారి వారి తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారు. హైదరాబాద్ నగరంలో నుండి చెత్త లారీలు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు వస్తున్నడడంతో ఈ చెత్త లారీల వల్ల కూడా ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఈ లారీల కిందపడి యువకులు చనిపోతున్నారు.. ఇన్ని ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం లో మాత్రం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ సి ఐ ఎల్ నుండి కీసర వరకు రోడ్డు నేరుగా ఉండడం వల్ల కుషాయిగూడలో రోడ్లు చిన్నగా ఉండటంతో. ట్రాఫిక్ సమస్య కూడా అంతరాయం పెరుగుతుంది.. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలలో ఇంజనీరింగ్ లోపాలను కూడా పరిశీలించాల్సింది.. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను. క్షతగాత్రులను సమీపంలోని స్థానిక ఆసుపత్రికి వైద్యం కోసం చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలకు కారణమయ్యే రహదారుల లోపాలను కూడా గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మళ్లీ మళ్లీ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి. ప్రమాద లోపాలను గుర్తించాల్సి ఉంది... ఆయా రాష్ట్రాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు అమలవుతున్న విధానాలను మన తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాల్సింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలి. ప్రమాదాల సంఖ్యను తగ్గించి మరణాల సంఖ్యను కూడా తగితగించాల్సి ఉంది. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా తొందర తొందరగా. అతివేగంగా. నిర్లక్ష్యంగా. వాహనాలను నడుపుతూ వారి ప్రాణాలు పోవడమే కాకుండా. రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులను. పాదచారులను మింగేస్తున్నారు... మన దేశంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలలో యువతి యువకులు చనిపోవడం బాధాకరం. నేటి యువతరం రేపటి భవిష్యత్తును తీర్చిదిద్దేటి భావి పౌరులు. అలాంటి పౌరులు రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోవడం బాధిస్తుంది..



**దామరపల్లి నర్సింహారెడ్డి**
**9581358696**

# అధికారం శాశ్వతం కాదు!



గత పన్నెండేళ్ల భారత రాజకీయాలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పాలకులు, అదే ప్రజాస్వామ్య సంస్థలపై తమ ఆధిపత్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించి నప్పుడు వ్యవస్థలోని సమతుల్యత దెబ్బతింటుంది. 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ,ఆరెస్సెస్ భావజాల ప్రభావంలో సాగుతున్న రాజకీయాలు దేశానికి అభివృద్ధి, అవినీతి నిర్మూలన, జాతీ య గౌరవం వంటి హామీలను ఇచ్చాయి. కానీ పన్నెండేళ్ల పాలనా అనుభవం అనేక ప్రశ్నలను ముందుకు తెచ్చింది. మీడియా స్వేచ్ఛ నుంచి దర్యాప్తు సంస్థల తీరువరకు, ఎన్నికల పారదర్శకత నుంచి మత సామరస్యం వరకు ఎన్నో అంశాల్లో ప్రజాస్వామ్య విలువలు తీవ్ర పరీక్షను ఎదుర్కొంటున్నాయి.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు. అధికారాన్ని జవాబుదారీగా ఉంచే పౌర బాధ్యత. అయితే ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులపై దేశద్రోహులనే ముద్ర వేయడం లేదా వారిని జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకులుగా చిత్రించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. పాకిస్తాన్‌ను చూపించి ప్రశ్నలను అణచివేయడం, చైనాను ప్రస్తావించి విమర్శకుల దేశభక్తిని అనుమానించడం పాలనకు సమాధానం కాదు. దేశభక్తి అంటే పాలకులను సమర్థించడం కాదు; దేశ ప్రజల హక్కు లను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య సంస్థలను కాపాడటం.

మీడియా విషయంలోనూ ఇదే సమస్య కనిపిస్తోంది. స్వతంత్ర మీడియా అధికారానికి అసౌకర్యకరమైన ప్రశ్నలు వేయాలి. ప్రభుత్వ ప్రకటనలను యథాతథంగా ప్రసారం చేయడం, ప్రతిపక్షాలపై మాత్రమే నిరంతరం దాడి చేయడం, ప్రజల జీవన సమస్యల కంటే మతపరమైన వివాదాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జర్నలిజం బాధ్యతను బలహీనపరుస్తాయి. మీడియా సంస్థల యాజమాన్య ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రకటనలపై ఆధారపడటం, దర్యాప్తు సంస్థల ఒత్తిళ్లపై వచ్చిన ఆరోపణలు ఈ సమస్యను మరింత తీవ్రతను పెంచుతున్నాయి. ప్రతి మీడియా సంస్థ ప్రభుత్వానికి అనుకూలమ ని చెప్పలేం. అయినప్పటికీ అధికారాన్ని ప్రశ్నించే జర్నలిజం క్షీణిస్తే, ప్రజలకు అందే సమాచారం అసంపూర్ణమవుతుంది. ప్రజాస్వామ్యంలో మీడియా పాలకుల ప్రచార విభాగంగా మారడం అత్యంత ప్రమాదకరం.

కేంద్ర దర్యాప్తు సంస్థల విషయంలోనూ రాజకీయ పక్షపాతంపై ఆందోళనలు పదేపదే వ్యక్తమయ్యాయి. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు చట్టాన్ని అమలు చేయడానికి ఏర్పడ్డాయి. అవి అధికార పార్టీకి చెందినవారిపైనా, ప్రతిపక్షా లకు చెందినవారిపైనా ఒకే ప్రమాణాలతో పనిచేయాలి. కానీ ప్రతిపక్ష నేతలపై దర్యాప్తులు, అరెస్టులు, విచారణల వేగాన్ని పెంచటం, అధికార పక్షంలో చేరిన కొందరిపై చర్యల విషయంలో దర్యాప్తు నిలిచిపోవడం, కొందరిపై ఆరోపణలను వెనుకకు తీసుకోవటం వంటి తేడాలపై ప్రశ్నలు తలెత్తినప్పుడు ప్రభుత్వం పారదర్శకమైన సమాధానాలు ఇవ్వాలి. ఆరోపణ ఎదుర్కొంటున్న ప్రతి వ్యక్తి దోషి కాదు; అదే సమయంలో రాజకీయ నాయకు డనే కారణంతో ఎవరూ చట్టానికి అతీతులు కారు. న్యాయమైన దర్యాప్తు అంటే రాజకీయ ప్రత్యర్థిని లొంగదీసుకోవడం కాదు, సాక్ష్యాధారాలతో నిజాన్ని నిర్ధారించడం.

న్యాయవ్యవస్థను కూడా ఇదే ప్రమాణంతో చూడాలి. భారత న్యాయస్థానాలు అనేక సందర్భాల్లో ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించాయి, పౌర హక్కులను పరిరక్షించాయి. కాబట్టి మొత్తం న్యాయవ్యవస్థను ప్రభుత్వం గుప్పిట్లో పెట్టుకుందని నిర్ధారించడం సరైన విశ్లేషణ కాదు. అయితే బెయిల్, విచారణలో జాప్యం, దీర్ఘకాల నిర్బంధం, రాజ్యాంగ హక్కుల అమలు వంటి అంశాల్లో కనిపించే అసమానతలను ప్రశ్నించడం అత్యవసరం. నేరం నిరూపించబడకముందే ఒక వ్యక్తి సంవత్సరాల తరబడి జైలులో ఉంటే, అతని స్వేచ్ఛకు జరిగిన నష్టాన్ని తరువాతి నిర్దోషిత్వ తీర్పు పూర్తిగా భర్తీ చేయలేదు. ప్రభుత్వాన్ని విమర్శించిన వ్యక్తికి చట్టం కఠినంగా, అధికారాన్ని సమర్థించిన వ్యక్తికి ఉదారంగా వర్తిస్తోందనే భావన ఏర్పడినా అది న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

ఎన్నికల వ్యవస్థ విషయంలోనూ విశ్వసనీయతే అసలు ప్రశ్న. ఎన్నికల సంఘం అధికార పార్టీకీ, ప్రతిపక్షాలకీ సమాన దూరంలో నిలబడాలి. ఎన్నికల నియమాల అమలు, ప్రచార ఖర్చులు, ఓటర్ల జాబితాలు, ఎన్నికల బాండ్లు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఎన్నికల ప్రసంగాల్లో కుల,మత విద్వేషాలు రెచ్చగొట్టటం వంటి అంశాల్లో సందేహాలకు తావులేని వివరణలు అవసరం. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసి, రాజకీయ విరాళాల పారదర్శకతపై కీలకమైన తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు రాజకీయ నిధుల వ్యవస్థలో ఉన్న లోపాలను బయటపెట్టింది. రాజకీయ పార్టీలకు ఎవరు ఎంత విరాళం ఇచ్చారు, దానికి ప్రతిఫలంగా ఏమైనా ప్రయోజనాలు లభించాయా అనే ప్రశ్నలకు ప్రజలకు సమాధానాలు దొరకాలి. ఎన్నికల్లో గెలవడం ప్రజల ఆమోదానికి సూచికే తప్ప, ప్రతి నిర్ణయానికీ నిరవధిక అనుమతి కాదు.

అధికార కేంద్రీకరణకు మరో ప్రమాదకరమైన రూపం మత రాజకీయాలు. ఆరెస్సెస్ హిందూత్వ భావజాలాన్ని రాజకీయ రంగంలో విస్తరించడం, బీజేపీ ఎన్నికల ప్రచారంలో మతపరమైన గుర్తింపులకు ప్రాధాన్యం ఇవ్వడం దేశంలోని సామాజిక సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. హిందువుల విశ్వాసాలను గౌరవించడం ఒక విషయం; ఆ విశ్వాసాలను రాజకీయ ఆధిపత్యానికి సాధనంగా ఉపయోగించడం మరో విషయం. ముస్లింలు, క్రైస్తవులు లేదా ఇతర మైనారిటీలు నిరంతరం అనుమానపు చూపులకు గురయ్యే వాతావరణం ఏర్పడితే రాజ్యాంగం హామీ ఇచ్చిన సమాన పౌరసత్వం బలహీనపడుతుంది. మతం ఆధారంగా ప్రజలను విభజించడం ద్వారా ఎన్నికల్లో తాత్కాలిక లాభం పొందవచ్చు. కానీ సమాజంలో పెరిగిన ద్వేషం, అవిశ్వాసం, హింస వల్ల కలిగే నష్టం తరతరాలపాటు కొనసాగుతుంది.

ఆర్థిక రంగంలోనూ ప్రచారానికి, ప్రజల అనుభవానికి మధ్య అంతరం కనిపిస్తోంది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఒక్కటే దేశ ఆర్థిక ఆరోగ్యానికి పూర్తి కొలమానం కాదు. ఉద్యోగాల నాణ్యత, యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ఆదాయాలు, చిన్న వ్యాపారాల పరిస్థితి, ధరల భారం, అసమానతలు కూడా అంతే ముఖ్యమైనవి. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా 2024లో విడుదల చేసిన భారత ఉపాధి నివేదిక యువత నిరుద్యోగం, విద్యావంతుల ఉపాధి సమస్యలపై తీవ్రమైన ఆందోళనలను వెల్లడించింది. అభివృద్ధి గణాంకాలను ప్రచారం చేసుకుంటూనే ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే ప్రభుత్వ విజయగాథ అసంపూర్ణంగానే మిగులుతుంది.

ఇలాంటి పరిస్థితుల్లో యువతను కేవలం ఎన్నికల ప్రచారానికి ఉపయోగించు కునే ఓటర్లుగా చూడలేం. వారికి ఉపాధి కావాలి, నాణ్యమైన విద్య కావాలి, ప్రశ్నించే స్వేచ్ఛ కావాలి, తమ భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కావాలి. అవినీతి, నిరుద్యోగం, సామాజిక వివక్ష, ప్రజాస్వామ్య సంస్థల పనితీరుపై వారు ప్రశ్నలు వేస్తే వాటిని రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం సమస్యను పరిష్కరించదు. నిరసనలను అణచివేయడం ద్వారా అసంతృప్తిని కొంతకాలం దాచవచ్చు; దాని మూలాలను తొలగించలేం. శాంతియుత నిరసన ప్రజాస్వామ్యానికి ముప్పు కాదు. అది పాలకులు వినాల్సిన హెచ్చరి క. ప్రజాస్వామ్యానికి అసలు ప్రమాదం ప్రతిపక్షం బలహీనంగా ఉండటంలో మాత్రమే లేదు; అధికారంలో ఉన్నవారు తమను తాము ప్రశ్నలకు అతీతులుగా భావించడంలో ఉంది. మీడియా, దర్యాప్తు సంస్థలు, న్యాయస్థా నాలు, ఎన్నికల సంఘం, పార్లమెంటు-ఏ వ్యవస్థా ఒక పార్టీకి శాశ్వత ఆస్తి కాదు. అవి ప్రజల రాజ్యాంగబద్ధమైన సంస్థలు. వాటి స్వతంత్రతను కాపాడటం ప్రభుత్వానికే కాదు, ప్రతిపక్షాలకు, పౌర సమాజానికి, న్యాయవ్యవస్థకు, మీడియాకు కూడా బాధ్యత ఉంటుంది. గత పన్నెండేళ్ల పాలనపై చరిత్ర ఇచ్చే తీర్పు ఎన్నికల విజయాల సంఖ్యతో మాత్రమే నిర్ణయించబడదు. ఎంతమంది పేదల జీవితం మెరుగుపడింది, యువతకు ఎన్ని అవకాశాలు లభించాయి, మైనారిటీల భద్రత ఎంత పెరిగింది, సంస్థలు ఎంత స్వతంత్రంగా పనిచేశాయి, విమర్శకుల స్వరం ఎంత స్వేచ్ఛగా వినిపించింది అన్నదాని తోనూ నిర్ణయించబడుతుంది. బీజేపీకి, ఆరెస్సెస్‌కు తమ విధానాలను సమర్థించుకునే హక్కు ఉంది; కానీ వాటిని ప్రశ్నించే ప్రజల హక్కును హరించే అధికారం లేదు. అధికారం ఎంత బలంగా కనిపించినా అది ప్రజల విశ్వాసం మీదనే నిలబడుతుంది. ఆ విశ్వాసం దెబ్బతిన్నప్పుడు ప్రచార యంత్రాంగం, దర్యాప్తు భయం, మతపరమైన ఉద్రేకాలు దాన్ని శాశ్వతంగా నిలబెట్టలేవు. ప్రజాస్వామ్యంలో అంతిమ అధికారం ప్రజలదే. పాలకులు గుర్తుంచుకోవా ల్సిన సత్యం ఒక్కటే: ప్రజలు ప్రశ్నించడం ఆపినప్పుడు ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది; ప్రజలు ప్రశ్నించడం ప్రారంభించినప్పుడు అధికారానికి జవాబుదారీతనం తప్పనిసరి అవుతుంది. రాజ్యాంగం కంటే గొప్పవారు ఎవరూ లేరు. ప్రజల కంటే శాశ్వతమైన అధికారం ఏదీ లేదు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



# ప్రజాస్వామిక అస్తిత్వానికి పాల్పడుతున్న ఎన్నికల సంఘం

## ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ.. హక్కుల పరిరక్షణా? హక్కుల తొలగింపా?

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా చర్చకు వచ్చిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల సంఘం బాధ్యతలు, అధికారాలపై విస్తృతమైన చర్చకు దారితీసింది. ఓటర్ల జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లు, అర్హతలేని నమోదులు తొలగించడం, చిరునామాలు మారినవారి వివరాలను సరిచేయడం ఎన్నికల నిర్వహణలో అవసరమైన చర్యలే. ఎన్నికల సంఘం వాదన ప్రకారం, ఓటర్ల జాబితా విశ్వసనీయంగా ఉండటానికి ఇటువంటి సవరణలు ఉపయోగపడతాయి. అయితే ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతే, ఆ పొరపాటును సరిదిద్దే బాధ్యత కూడా ఎన్నికల సంఘానిదే. ఒకవైపు నకిలీ నమోదులను తొలగించాలనే లక్ష్యం, మరోవైపు నిజమైన ఓటర్లను జాబితాలో కొనసాగించాలనే రాజ్యాంగబద్ధమైన బాధ్యత పరస్పరం విరుద్ధమైనవి కావు. రెండింటినీ సమర్థంగా సాధించడమే ఎన్నికల సంఘం సామర్థ్యానికి అసలైన పరీక్ష.

2025లో బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణపై న్యాయపరమైన వివాదాలు తలెత్తాయి. పత్రాల సమర్పణ, అర్హతల నిర్ధారణ, గడువులు, ఓటర్ల పేర్ల తొలగింపునకు అనుసరించాల్సిన విధానం వంటి అంశాలు చర్చనీయాంశాలయ్యాయి. ఈ వివాదాల్లో ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఆ అధికారాల వినియోగంలో పాటించాల్సిన న్యాయపరమైన పరిమితులను పరిశీలించారు. భారత సుప్రీంకోర్టు తన తీర్పులో బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు చట్టపరమైన ఆధారం ఉందని, తగిన విధానపరమైన రక్షణలు పాటించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. అయితే ఏ సవరణ ప్రక్రియకైనా చట్టబద్ధమైన అధికారం ఉందనే విషయం, ఆ ప్రక్రియలో జరిగే ప్రతి చర్య తప్పులేనిదని నిరూపించదు. ప్రతి ఓటరు తొలగింపు నిర్ణయం చట్టబద్ధంగా, ఆధారాలతో, తగిన విచారణతో జరగాలి.

2026లోనూ ఓటర్ల జాబితాల సవరణపై దేశవ్యాప్తంగా రాజకీయ విమర్శలు, ప్రజా నిరసనలు, న్యాయపరమైన ప్రశ్నలు కొనసాగుతున్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయాయనే ఆరోపణలను ప్రతిపక్షాలు లేవనెత్తుతుండగా, ఎన్నికల సంఘం జాబితాల శుద్ధీకరణ అవసరాన్ని సమర్థిస్తోంది. ఈ ఆరోపణల్లో ప్రతి ఒక్కటి నిరూపితమైందని ముందుగానే నిర్ధారించడం సరికాదు. అదే విధంగా, ఎన్నికల సంఘం వివరణ ఇచ్చిందనే కారణంతో ప్రతి సందేహాన్ని కొట్టిపారేయడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ఆరోపణలను స్వతంత్రంగా పరిశీలించడం, తొలగించిన పేర్ల సంఖ్యను స్పష్టంగా వెల్లడించడం, అర్హులైన ఓటర్లు తిరిగి నమోదు కావడానికి సులభమైన మార్గాలను కల్పించడం, అవసరమైన చోట న్యాయపరమైన పరిష్కారాలను అందించడం ద్వారానే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టగలదు.

భారత ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకం. ఎన్నికలను నిర్వహించే సంస్థపై ప్రజలకు నమ్మకం లేకపోతే, ఎన్నికల ఫలితాలపై కూడా అనుమానాలు పెరిగే ప్రమాదం ఉంది. అధికారంలో ఉన్న పార్టీకి, ప్రతిపక్షాలకు, చిన్న రాజకీయ పార్టీలకు, స్వతంత్ర అభ్యర్థులకు సమానమైన నిబంధనలు వర్తింపజేయాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల ప్రచారంపై పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, ఓటర్ల జాబితాల తయారీ వంటి అంశాల్లో పక్షపాతానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి.

ఎన్నికల సంఘం నిర్ణయాలు విమర్శలకు అతీతమైనవి కావు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ సంస్థలను ప్రశ్నించడం రాజ్యాంగ వ్యతిరేక చర్య కాదు. అయితే విమర్శలు కూడా ఆధారాలతో ఉండాలి. రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేయడం ఎంత తప్పో, ప్రజల సందేహాలకు సమాధానాలు ఇవ్వకుండా అధికారాన్ని మాత్రమే ప్రస్తావించడం కూడా అంతే అనుచితం. ఎన్నికల సంఘం తన నిర్ణయాలకు కారణాలను వెల్లడిస్తూ, గణాంకాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతూ, రాజకీయ పక్షాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ వ్యవహరించాలి. సంస్థాగత స్వతంత్రత అంటే ప్రజలకు జవాబుదారీతనం లేకపోవడం కాదు; రాజకీయ జోక్యానికి లొంగకుండా చట్టం ప్రకారం పనిచేయడం, అదే సమయంలో తన చర్యలను సమర్థించగల పారదర్శకత కలిగి ఉండటం.

**ఓటర్ల జాబితాలో పొరపాట్లకు బాధ్యత ఎవరిది?**

ఒక పేద కార్మికుడు జీవనోపాధి కోసం ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలస వెళ్తున్నాడనుకుందాం. ఒక వృద్ధురాలు అవసరమైన పత్రాలను సమయానికి సమర్పించలేకపోయిందనుకుందాం. ఒక గ్రామీణ పౌరుడికి తన పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేదనుకుందాం. ఇలాంటి పరిస్థితుల్లో వారి పేర్లు తొలగిపోతే, వారు తమ హక్కును తిరిగి పొందడానికి ఎన్ని కార్యాలయాలు తిరగాలి? ఎన్ని దరఖాస్తులు చేయాలి? ఎన్ని రోజులు వేచి చూడాలి? ఈ ప్రశ్నలకు ఎన్నికల వ్యవస్థ సమాధానం చెప్పాలి.

ఓటరు తన పేరు తొలగిపోయిన విషయాన్ని ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తరువాత తెలుసుకుంటే, అప్పటికే అతని ప్రజాస్వామిక భాగస్వామ్యానికి నష్టం జరిగిపోయినట్లే. అందుకే ఎన్నికలకు చాలాకాలం ముందుగానే ఓటర్ల జాబితాలను పరిశీలించే అవకాశం కల్పించాలి. పేర్లు తొలగించే ముందు చట్టం నిర్దేశించిన నోటీసు, విచారణ, అభ్యంతరాల స్వీకరణ వంటి విధానాలను పాటించాలి. తప్పుగా తొలగించిన పేర్లను తిరిగి చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలి. ఓటర్ల జాబితా సవరణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పటికీ, తుది నిర్ణయాల్లో మానవీయ విచక్షణ, న్యాయబద్ధత, ప్రజలకు అందుబాటులో ఉండే సహాయ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని 21వ అధికరణం ఓటర్ల జాబితాల తయారీ, సవరణకు సంబంధించినది. 22వ అధికరణం నమోదుల సవరణ, 23వ అధికరణం పేర్ల చేర్పు, 24వ అధికరణం అప్పీళ్లకు సంబంధించిన నిబంధనలను కలిగి ఉన్నాయి. ఈ చట్టపరమైన వ్యవస్థ ఓటర్ల జాబితాను సరిచేసే అధికారంతో పాటు, తప్పులను సరిదిద్దుకునే మార్గాలను కూడా కల్పిస్తుంది. కాబట్టి ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించడం, ఫిర్యాదులను పరిష్కరించడం, చట్టపరమైన మార్గాలను సులభతరం చేయడం ఎన్నికల నిర్వహణలో అంతర్భాగం.

ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత ఎన్నికల సంఘానిదే కాదు; రాజకీయ పార్టీలు, న్యాయవ్యవస్థ, ప్రసార మాధ్యమాలు, పౌర సమాజం, ప్రతి ఓటరుపై కూడా ఉంది. రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాల్లోని లోపాలను ఆధారాలతో బయటపెట్టాలి. మీడియా ఆరోపణలను మాత్రమే ప్రచారం చేయకుండా, అధికారిక గణాంకాలు, న్యాయస్థానాల పరిశీలనలు, బాధితుల అనుభవాలు, ఎన్నికల సంఘం వివరణలను సమగ్రంగా పరిశీలించాలి. పౌరులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో సరిచూసుకోవాలి. పేరు లేకపోతే సంబంధిత అధికారులను సంప్రదించి, అవసరమైన దరఖాస్తులు సమర్పించి, చట్టబద్ధమైన పరిష్కారం పొందాలి.

ఓటర్ల జాబితా సవరణలో ప్రజలకు సరైన సమాచారం అందించడానికి ఎన్నికల సంఘం స్థానిక భాషల్లో ప్రచారం నిర్వహించాలి. గ్రామాలు, పట్టణాలు, వలస కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- ఎస్టీఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ




**ముషీరాబాద్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఎస్టీఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయం నుంచి ధర్నా చౌక్ వరకు కొనసాగింది. దక్షిణాది రాష్ట్రాల శిక్షణ తరగతులకు హాజరైన 120 మంది ప్రతినిధులతో పాటు స్థానిక టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీకి నేతృత్వం వహించిన ఎస్టీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రధాన కమిషనర్ నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, కేంద్ర మంత్రిని సభ్యుడిగా చేర్చడం ద్వారా అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులను నియమించుకునే అవకాశం కల్పించారని విమర్శించారు. ఈ నేపథ్యంలో నియమితులైన జ్ఞానేశ్ కుమార్ తన విధేయతను నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తోటి ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఫారం-6లో చేసిన మార్పులు, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే ప్రమాదాన్ని కలిగిస్తున్నాయని చావ రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఎన్నికల ప్రధాన కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ద్వారా దేశాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ కోశాధికారి టీకేఏ షఫీ, ఉపాధ్యక్షులు మయిల్, వెంకటేశ్వర్లు, కార్యదర్శులు మయవన్, అరుణకుమారి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, నాయకులు దుర్గాభవాని, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో బీజేపీ పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమం



**తాండూరు, ఆక్టోబర్ 10 (జనంసాక్షి) :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తాండూరులో బీజేపీ పార్టీ పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. తాండూరు బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం, ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, మాజీ 1వ వార్డు కౌన్సిలర్ బాలప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1వ వార్డు నుంచి 6వ వార్డు వరకు ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను గుర్తించి, ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేస్తున్నాం. పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని, బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి" అని పిలుపునిచ్చారు. పట్టభద్రులు తమ డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫోటోతో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# పేపర్ పరిశ్రమ వ్యర్థాలపై సమగ్ర విచారణ జరపాలి

- బీజేపీ మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్



**కొందుర్గు, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని సర్వే నంబర్ 109లో ఉన్న ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని, అక్కడ కుమ్మరిస్తున్న దివ్యశక్తి పేపర్ పరిశ్రమ వ్యర్థాలపై సమగ్ర విచారణ జరపాలని భారతీయ జనతా పార్టీ నేత డిమాండ్ చేసారు. ఈ మేరకు శనివారం బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి ఒక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లి ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి అని, దాన్ని అక్రమంగా తవ్వుతూ, అనుమతులు లేకుండా మట్టిని తరలించడం చట్టవిరుద్ధమని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా పారిశ్రామిక వ్యర్థాలను ఇక్కడ పారబోయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీస్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణమే స్పందించి, సమన్వయంతో క్షేత్రస్థాయి విచారణ జరపాలని కోరారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' సమీపంలోనే ఈ అక్రమాలు జరగడం అత్యంత విచారకరమన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు, ఉపాధ్యాయులు సురక్షితమైన, కాలుష్య రహిత వాతావరణంలో ఉండేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక వ్యర్థాల వల్ల స్థానిక నేల, భూగర్భ జలాలు, సమీప పంట పొలాలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు పలు డిమాండ్లు తెలుపుతూ...సర్వే నంబర్ 109లో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని, దివ్యశక్తి పేపర్ పరిశ్రమ కాలుష్య వ్యర్థాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజా ఆస్తులు, పర్యావరణ పరిరక్షణ కోసం అధికారులు చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.

# పప్పుధాన్యాల అధికోత్పత్తే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ అర్జున్ శివహారే
- క్షేత్రస్థాయిలో పప్పుధాన్యాల సాగు పరిశీలన



**న్యాకల్‌కల్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** విదేశాల నుండి దిగుమతి అయ్యే పప్పుధాన్యాలను తగ్గించి.. స్వదేశం (భరత్)లోనే వివిధ రకాల పప్పు ధాన్యాల అధికోత్పత్తికై కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అధిక ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంతో.. "మిషన్ ఫర్ ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్" యొక్క ముఖ్య ఉద్దేశమని కేంద్ర పప్పుధాన్యాల ఉత్పత్తి జాయింట్ డైరెక్టర్ అర్జున్ కుమార్ శివహారే స్పష్టం చేశారు. శనివారం "ఆత్మ నిర్భరత" కార్యక్రమంలో భాగంగా న్యాల్ కల్ మండలం, వడ్డీ, గంగ్వార్ గ్రామాల శివారులో సాగుచేసిన పలు పప్పు ధాన్యాల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జహీరాబాద్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి వైద్యనాథ్, మండల ఏవో అభినాష్ వర్మ, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, రైతులు, తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న పలు పప్పుధాన్యాల పంటలను పరిశీలించారు. సాగుచేసిన రైతులు, కౌలు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. నాణ్యతతో కూడిన వివిధ రకాల విత్తనాలు, రాయితీలు, ఎరువుల పంపిణి పై రైతులతో నేరుగా పరిశీలన బృందం సమీక్షించారు."ఆత్మనిర్భరత" కార్యక్రమం మండలంలో సమర్థవంతంగా అమలవుతున్న నేపథ్యంలో కేంద్ర పరిశీలన బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. కార్యక్రమంలో గంగువార్ సర్పంచ్ సుకుమార్, కేవికె విజ్ఞాన శాస్త్రవేత్త వరప్రసాద్, ఏవో రాజ్ నారాయణ, నారింజ రైతు మిత్ర సీఈఓ శ్రీకాంత్ రెడ్డి, ఏఈఓలు, రైతులు, అధికార, విపక్ష పార్టీలకు చెందిన శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం



**షాబాద్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాలు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి ఆదేశాల మేరకు చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో అదనపు డిసిపి జహంగీర్ మార్గదర్శకత్వంలో శంకర్పల్లి మండలం మీర్జాగూడ ఇంద్రారెడ్డి నగర్ కాలనీకి చెందిన మారం వంశి రెడ్డి (23) బీర ప్రవీణ్ కుమార్ (28) 13.97 గ్రాముల డ్రగ్స్ మాదకద్రవ్యం అక్రమంగా తరలిస్తుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు షాబాద్, నాగర కుంట చౌరస్తా వద్ద చేవెళ్ల జోన్ ఎస్ఓటి మరియు షాబాద్ పోలీసుల సంయుక్త రహస్య ఆపరేషన్ లో శనివారం పట్టుబడ్డారు. అనంతరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరు కు చెందిన స్టీఫెన్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి హైదరబాద్, మోకిల, నానక్ రామ్ గూడ, కోకాపేట్ ప్రాంతాలలోని విద్యార్థులకు మరియు సాఫ్ట్వేర్ ఉద్యోగులకు విక్రయించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సుమారు రెండు లక్షల విలువగల డ్రగ్స్ మాదకద్రవ్యాన్ని, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులపై ఎన్డిపిఎస్ ఏసిటి1985 లోని సెక్షన్8(సి) రెడ్ విత్ 22(సి) ప్రకారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. బెంగళూరులోని స్టీఫెన్ అనే వ్యక్తి కొరకు దర్యాప్తు కొనసాగుతుందని అతని ఆచూకీ గుర్తించి చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. యువత భవిష్యత్తుకు దెబ్బతీసే మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. మాదకద్రవ్యాలు అక్రమ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినవారు పోలీసులకు తెలియజేయాలని కోరుతూ, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

# ఓటు హక్కు పరిరక్షణకు బీఆర్ఎస్ ధర్నా

**ఎల్బీనగర్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలపై వస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులను నిర్బంధించడాన్ని ఖండిస్తూ, వారిని క్షేమంగా స్వరాష్ట్రాలకు పంపించాలని కోరారు. ఓటు హక్కు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రఘువీర్ రెడ్డి మహేష్ యాదవ్ విఠల్ రెడ్డి ఉద్యమకారులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



**మొయినాబాద్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** టియూడబ్ల్యుజే, ఐజేయూ చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన ఎలక్ట్రానిక్ మీడియా ఎన్నికల్లో మొయినాబాద్ మండలానికి చెందిన రాంపల్లి సంతోష్ కుమార్ జిల్లా ఈసీ మెంబర్గా, బాకారం గ్రామానికి చెందిన కొండకళ్ల శ్రీకాంత్ జనరల్ సెక్రటరీగా, అమావుర్ గ్రామానికి చెందిన సామ వామన్రెడ్డి జాయింట్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను టియూడబ్ల్యుజే, ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్రెడ్డి, జిల్లా అధ్యక్షులు సలీం పాషాలు నిర్వహించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన మండలానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు అన్ని విధాలుగా కృషి చేయాలని పేర్కొన్నారు. నూతనంగా ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బాధ్యతను అప్పగించడంతో పాటు తోటి జర్నలిస్టులకు ఎలాంటి సమస్యలు ఉన్నా చేదోడువాదోడుగావెంటుండి కృషి చేస్తామన్నారు.

# సాగునీటి సాధనకు బీఆర్ఎస్ పార్టీ ఉద్యమం

- రాచకొండ ఎత్తిపోతలపై ప్రభుత్వం దృష్టి సారించాలి
- మూడేండ్లల్లో సాగునీటి ముచ్చట ఎత్తని ఎమ్మెల్యే
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి



**రంగారెడ్డి, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఎడగడ్డగా మారుతున్న రంగారెడ్డి జిల్లా తూర్పు ప్రాంతానికి శాశ్వత పరిష్కారం దిశగా బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిన రాచకొండ ఎత్తిపోతల పథకం పనులు వెంటనే చేపట్టాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సాగునీటిని సాధించేందుకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి నాయకత్వంలో బిఆర్ఎస్ రైతాంగ ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని చెప్పారు. నల్గొండ జిల్లా పశ్చిమ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు శివన్నగూడెం వద్ద 12 టిఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో బిఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. కాలువల నిర్మాణం పనులు 90 శాతం మేర పూర్తయ్యాయని మిగతా పది శాతం పనులను పూర్తిచేసి డిండి నుండి శివన్నగూడెంకు కృష్ణా నీటిని తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి నుండి నీటిని ఎత్తిపోసి రంగారెడ్డి జిల్లా తూర్పు ప్రాంతానికి సాగునీరు అందించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వే పనులు పూర్తి చేసి డిపిఆర్ రూపొందించారని గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో 122 చెరువులను నింపేందుకు సబితమ్మ , మంచిరెడ్డి కిషన్ రెడ్డి పట్టుబట్టి ప్రభుత్వాన్ని ఒప్పించారని చెప్పారు. వారి పట్టుదల వల్లే రాచకొండ ఎత్తిపోతల పథకం సర్వే పనులకు 1.72 కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసి సర్వే చేయించిందని , సమగ్ర ప్రణాళిక నివేదిక సిద్ధం చేసిందని వివరించారు. ప్రభుత్వం మారడంతో గత మూడేళ్లుగా ఆ నివేదికను మూలన పడేసారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిరోజు నుంచే సాగునీటి సాధన కోసం అనేక విధాలుగా గత కాంగ్రెస్ , బిఆర్ఎస్ ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారని చెప్పారు. తొలిసారి ఎన్నికైన యాదాదికే పెద్ద చెరువులో మహా వరుణ యాగం చేసి వాన దేవుడి కరుణ కోరడంతో పాటు , ఇక్కడి కరువు తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయారని తెలిపారు. మాల్ నుండి అసెంబ్లీ వరకు మూడు రోజుల పాటు పాదయాత్ర చేసి ప్రజలను సాగునీటి ఉద్యమంలో భాగస్వాములను చేసారని గుర్తు చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోయినా సాగునీటి ఉద్యమాన్ని మంచిరెడ్డి వదలకుండా పోరాటం చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 44 కోట్ల రూపాయలు మంజూరు చేయించి నియోజకవర్గంలోని చెరువులను బాగు చేయించారని చెప్పారు. అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు ను ఇబ్రహీంపట్నం రప్పించి 16.34 కోట్ల రూపాయలు మంజూరు చేయించి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువుకు నీరొచ్చే పెద్ద వాగును పూర్తిగా ప్రక్షాళన చేయించారని వివరించారు. పెద్ద వాగు పనులు పూర్తి చేయడం వల్లనే ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు లోకి నీరు చేరిందని , చెరువుకు పూర్వవైభవం వచ్చిందని అన్నారు. ఎలిమినేడులో శత చండీ యాగం చేసి కేసీఆర్ ను రప్పించి ఇక్కడి సాగునీటి ఆవశ్యకతను వివరించి రాచకొండ ఎత్తిపోతలకు ఒప్పించారని ఆయన వివరించారు. గడిచిన మూడేళ్లలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి రాచకొండ ఎత్తిపోతలపై , సాగునీటి అంశంపై మాటమాత్రంగానైనా ప్రస్తావించకపోవడం శోచనీయమని అన్నారు. ఆయనకు మంత్రి పదవి మీదున్న యావ రైతుల నీటి కష్టాల మీద లేకపోవడం బాధాకరమని అన్నారు. సముద్రమట్టానికి 634 అడుగుల ఎత్తున ఉన్న ఈ ప్రాంతానికి సాగునీరు రావాలంటే శివన్నగూడెం నుండి రాచకొండ ఎత్తిపోతల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి మొద్దు నిద్ర వీడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాచకొండ ఎత్తిపోతల పనులను వెంటనే ప్రారంభింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతాంగ సాగునీటి ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తీవ్ర కరువు నేపథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలని , రైతులను ఆదుకోవాలని రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కుట్రలు, ప్రలోభాలను అధిగమించి విజయం సాధించాం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** అధికార పార్టీ అండతో విపక్ష కూటమి చేసిన కుట్రలు, ప్రలోభాలను అధిగమించి, కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కూటమికి కార్మికులు విజయం అందించారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, ఎంప్లాయిస్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి బీకే విశ్వనాథ్, ఏబీసీలు సీఆర్ గౌడ్, ఎంఎన్ రావు, ఉద్యోగులు నీలస్వామి, వీ.వీ. మూర్తి అన్నారు. రాష్ట్ర గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో శనివారం వనపర్తి ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కార్మికుల హక్కులను సాధించే సత్తా ఈయూ కూటమికే ఉందని కార్మికులు విశ్వసించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని వక్తలు పేర్కొన్నారు. గతంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోరాటాలను గుర్తుంచుకుని కార్మికులు తమకు మద్దతుగా ఓట్లు వేశారని తెలిపారు. తమకు మద్దతుగా నిలిచిన కార్మికులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రభుత్వంతో పోరాడి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు హక్కులను సాధించేందుకు కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఆర్టీసీ ఈయూ కూటమి నాయకులు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగ ప్రముఖులు సూర్యనారాయణ, రవి, ఎంఎన్ రావు, సీఆర్ గౌడ్, నీలస్వామి, వీ.వీ. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
11 అక్టోబర్ 2026

# పోలీసుల విజయాల వెనుక కుటుంబ సభ్యుల త్యాగాలు విలువైనవి

- ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు ఎంతో విలువైనవి జిల్లా కలెక్టర్ ప్రియాంక,ఎస్పి డాక్టర్ వినీత్ అన్నారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాక హాజరయ్యారు.ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు, కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అధికారులు, సిబంది కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పోలీసు అధికారులు,సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఆటలు, దాండియా, బతుకమ్మ, పాటలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు రాత్రనక, పగలనక, పండు గలతో సంబంధం లేకుండా 24 గంటలూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచే స్తారని కొనియాడారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వ హించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. పోలీసుల విధి నిర్వహణ వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగా లు,సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ గత ఏడాది కాలంగా జిల్లా పోలీ స్ శాఖలో కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతా ధికారుల వరకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేశారని తెలిపారు.పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు,సహకారం ఎంతో విలు వైనవని పేర్కొన్నారు.ఇలాంటి ఆత్మీయ సమ్మేళ నాలు పోలీసు కుటుంబాల మధ్య సాన్నిహిత్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తా యని అన్నారు. పోలీసులు విధుల్లో నిరంతరం నిమగ్నమై ఉండటం వల్ల వారి కుటుంబ సభ్యులు ఎన్నో సంద ర్భాల్లో తమ వ్యక్తిగత ఆనందాలను, అవసరా లను పక్కనపెట్టి సహక రిస్తారని ఎస్పీ తెలిపారు. పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహ నం, ప్రోత్సాహం ఎంతో విలువైనవని అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యుల సహకారంతోనే మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించగలుగుతున్నామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చూపుతున్న అంకితభావాన్ని కొనసాగి స్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య, సిఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు జోలికొస్తే ఉద్యమం తప్పదు

- ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల తొలగింపును నిలిపివేయాలి
- ఏఐవైఎఫ్ డిమాండ్



**బెజ్జంకి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని,అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల ప్రధాన కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు.శనివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.తొలగించిన ఓటర్ల వివరాలను బహిరంగపరచి,అభ్యంతరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వడ్లూరి మల్లేశం,పులి రమేష్,లింగాల మహేష్,శంకర్,రావుల రమేష్,మధు,నరేష్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఘన విజయం

- కూటమి గెలుపుకు కృషి చేసిన కార్మికులకు కృతజ్ఞతలు
- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు అందే అశోక్



**చేర్యాల, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో ఎన్ఎంయూ, టీఎంయూ బలపరిచిన ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) 8వేల పైచిలుకు ఓట్లతో రాష్ట్ర గుర్తింపు సంఘంగా ఘన విజయం సాధించిందని ఏఐటీయూసీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు అందే అశోక్ అన్నారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేర్యాల మండల కేంద్రంలోని హనుమాన్ టెంపుల్ చౌరస్తా వద్ద రోడ్డుపై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇది కార్మికుల విజయమని, ఎర్రజెండాపై నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు గతంలో 56 రోజుల సమ్మెలో అండగా నిలిచామని, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ భద్రత, వేతనాలు, పెండింగ్ బకాయిల చెల్లింపు, ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కోసం ప్రభుత్వంలో విలీనం చేయడానికి ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. తమను ఆదరించిన డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈరి భూమయ్య, నంగి కనకయ్య, పాల సాయిలు, గూడెపు సుదర్శన్, మ్యాక లింగం, నంగి సత్తయ్య, ఎగుర్ల ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, పరమశేఖర్, పోషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి



**కొమురవెల్లి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** సర్ పేరుతో దేశంలో ఓటర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగిస్తున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రోజు కొమురవెల్లి మండల కేంద్రంలో సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ,తెలంగాణ రైతు సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తాడూరు రవీందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రధాన ఎన్నికల అధికా రి జ్ఞానేష్ కుమార్ బిజెపి పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించాలని బిజెపి ఆర్ఎస్ఎస్ చెప్పినట్లుగా జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తూ దేశంలో 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించి బిజెపి పార్టీ గెలిచే విధంగా చేశాడని ప్రతిపక్ష పార్టీల ఓట్లను ప్రధానంగా మైనార్టీ దళిత ఓట్లను తొలగించడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నాడని బిజెపి పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్నాడని అందుకే కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ కమిషనర్ పదవికి ఆయన అనర్హుడాన్ని తాను వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియ పూర్తిగా నిలిపివేసి తీసివేసిన ఓట్లను మళ్లీ చేర్చాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం ప్రజా సంఘాల నాయకులు తేలు ఇస్తారి మ్యకల కృపాకర్ పాకనాటి బాలు మల్లం అంజయ్య గాంధారి శ్రావణ చారి ఆరుట్ల దయనదు నూకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పొట్టకూటి కోసం వెళితే.. ప్రాణాలు గాల్లోకి..

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇందువాసి గ్రామ కూలీ దుర్మరణం



**గట్టు, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** బతుకుదెరువు కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లిన కూలీల జీవితాల్లో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన 35 మంది దళితులు పత్తి తీసే పనుల కోసం కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరికి వలస వెళ్లారు. అక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని, ప్రతిరోజూ ట్రాక్టర్ ద్వారా పత్తి చేలల్లో పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కూలీలంతా ట్రాక్టర్‌పై భారత్ మాల రోడ్డు గుండా పనులకు వెళుండగా, రోడ్డు పనుల కోసం మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్ వేగంగా వచ్చి వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఏసేపు అనే కూలీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, నాగన్న అనే కూలీ పరిస్థితి అత్యంత విషమంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే రాయచూరు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రమాద వార్త తెలిసిన వెంటనే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పందించారు. రాయచూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలతో మాట్లాడి బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం-తెలంగాణ షిప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ ఛైర్పర్సన్ సరిత యాదగిరి రోడ్డు ప్రమాద బాధితులకు తాము అండగా ఉంటామని తెలంగాణ షిప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ ఛైర్పర్సన్ సరిత భరోసా ఇచ్చారు. ఇందువాసి గ్రామ బాధితులతో ఆమె ఫోన్లో మాట్లాడి ప్రమాద వివరాలను, వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని, వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

## గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటర్న్ డాక్టర్ల ధర్నా

- తొమ్మిది నెలలుగా అందని స్టైపెండ్




**గద్వాల, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** విదేశాల్లో మెడికల్ విద్య పూర్తి చేసి ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్, తెలంగాణలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వైద్యులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. గడచిన తొమ్మిది నెలలుగా వీరికి స్టైపెండ్ అందకపోవడంతో ఈ జాప్యాన్ని నిరసిస్తూ శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఇంటర్న్ డాక్టర్లు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. వెంటనే బకాయిపడ్డ అలవెన్సులను విడుదల చేయాలని, తమ సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమాన పనికి సమాన వేతనాన్ని,రెగ్యులర్ హౌస్ సర్జన్లతో సమానంగా 24 గంటల పాటు వార్డులు, అత్యవసర సేవల్లో శ్రమిస్తున్నప్పటికీ తమకు మాత్రం కేవలం రూ. 5,000 మాత్రమే ఇస్తూ తీవ్ర వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తొమ్మిది నెలల నిరీక్షణను, ఇప్పటికే 9 నెలలుగా రూపాయి స్టైపెండ్ అందక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రూమ్ రటటంట్లు, కనీస అవసరాలకు కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని వైద్యులు వాపోయారు.జీవో నంబర్ 32 అమలు చేయాలని, రెగ్యులర్ జూనియర్ డాక్టర్లతో సమానంగా తమకు కూడా నెలకు రూ. 29,792 స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చేశారు.మద్దతుగా నిలిచిన అసోసియేషన్లు,గద్వాలలో జరుగుతున్న ఈ ఆందోళనకు తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ తో పాటు పలు వైద్య సంఘాలు మద్దతు పలికాయి.ఆందోళన ఉధృతం చేస్తాం, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయి పడిన స్టైపెండ్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయకపోతే, రాబోయే రోజుల్లో విధులను బహిష్కరించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ఇంటర్న్ డాక్టర్లు హెచ్చరించారు.

## బానిస కార్మిక వ్యవస్థను అరికట్టి, బాధితులకు అండగా నిలవాలి

- ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** బానిస కార్మిక వ్యవస్థను అరికట్టి వారికి అండగా నిలవాలని ఎస్పి డాక్టర్ వినీత్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా 'ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్ జి ఓ ఆధ్వర్యంలో బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలన అవ గాహన వాల్ పోస్టర్ ఆవి ష్కరించారు. అనంతరం నారాయణపేట జిల్లాలో స్వేచ్ఛా రథాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ ప్రారంభిం చారు.ఈ ప్రచార వాహనం జిల్లాలో రెండు రోజులు వివిధ ప్రాంతాల్లో పర్యటి స్తూ బానిస కార్మిక వ్యవ స్థపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, కార్మికుల హక్కులు, బాధితులకు అందు బాటులో ఉన్న సహాయంపై ప్రచారం నిర్వహిస్తుంది. బానిస కార్మిక వ్యవస్థకు సంబంధించిన ఘటనలు ఎదురైతే లేదా అనుమా నాస్పద కేసుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజే యాలని ఎస్పీ సూచిం చారు. బాధితులు తమ సమస్యలను తెలియ జేసేందుకు టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 080- 6943 4343 అందుబాటులో ఉందని తెలిపారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు,ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర అసంఘటిత కార్మిక రంగాల్లో పనిచేసే వారికి ఈ కార్యక్రమం ద్వారా అవగా హన కల్పించనున్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయ నున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య,ఆర్ఐ విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

## 12న జిల్లాలో డిజిపి పర్యటన

- అధికారులు రికార్డులతో సిద్ధంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ నెల 12న సోమవారం మహబూబ్న గర్, నారాయణపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సర్కిల్ అధికారులు,డీఎస్పీలు, వివిధ విభాగాల అధికా రులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశించారు.డీజీపీ పర్యట నను దృష్టిలో ఉంచుకొని పోలీస్ స్టేషన్లలో కేసుల వివరాలు, పెండింగ్ కేసు లు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలు,శాంతిభద్రతల పరిరక్షణ, రికార్డులు, రిజిస్టర్లను క్రమ బద్ధంగా సిద్ధం చేసుకోవాల ని సూచించారు.అలాగే సైబర్ నేరాల నియంత్రణ, మహిళలు, బాలల రక్షణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యా ల నిర్మూలన, ప్రజా ఫిర్యా దుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు చేపడుతు న్న కార్యక్రమాల వివరాల తో సిద్ధంగా ఉండాలని తెలిపారు.పోలీస్ శాఖలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ ప్రజలకు సమ ర్థవంతమైన సేవలు అందిం చాలని జిల్లా ఎస్పీ అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య,సి ఐ లు శివ శంకర్, రామ్ లాల్, భగ వంత్ రెడ్డి, సైదులు,ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లలో అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు

- మాల నిరుద్యోగులు, విద్యార్థుల హక్కుల కోసం సమరశంఖం..
- ఐక్య పోరాటానికి పిలుపు



**నారాయణఖేడ్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఎస్సీ వర్గీకరణ అమలుతో మాలలకు ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో తీవ్ర నష్టం జరుగుతోందని మాల సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల పరిరక్షణ కోసం మాల నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నారాయణఖేడ్ పట్టణంలోని కార్తికేయ హోటల్‌లో శనివారం మాల మహానాడు జేఏసీ, మాల కోఆర్డినేషన్ ఫోరం ఆధ్వర్యంలో మాల నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల జేఏసీ, మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శకుంతల మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరుగుతున్న నష్టాలను ప్రజలకు వివరించి, హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని ఆమె కోరారు.

### ప్రజాప్రతినిధులు స్పందించాలి

మాలల సమస్యలపై ప్రజాప్రతినిధులు స్పందించాలని, తమ వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, నిరుద్యోగులు డిమాండ్ చేశారు. మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించని ప్రజాప్రతినిధులను రానున్న ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిలదీస్తామని పేర్కొన్నారు.

### ప్రతి మండలంలో అవగాహన సమావేశాలు

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో త్వరలో సమావేశాలు నిర్వహించి, ఎస్సీ వర్గీకరణ అంశంపై మాలల్లో అవగాహన కల్పించనున్నట్లు నాయకులు తెలిపారు. మాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు కలిసికట్టుగా తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు దేవరాజు, విశ్రాంత ప్రిన్సిపాల్ అనంతయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు నర్సిం లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవయ్య, సీనియర్ నాయకుడు కమలాపురం మారుతి, యువ నాయకులు గైని సాయిలు, సంజయ్ కుమార్, కె. నరసింహులు, , ఎం. నర్సింలు, విజయకుమార్, తిరుపతి, భీమ్‌సేన భాను, రాజు, లక్ష్మయ్య, మోహన్ రాజు, అనుముల తుకారం, జమ్మికుంట కళాబృందం సభ్యులు, పలువురు మాల సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

## దళిత ఉపసర్పంచ్ అవమానం పట్ల ఎమ్మార్పీఎస్ నిరసన

- ఇప్పపహాడ్ గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా



**ఊర్కొండ, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఇప్పపహాడ్ గ్రామంలో ఈ నెల 7న జరిగిన నూతన గ్రామ పంచాయతీ భవన భూమిపూజ శిలాఫలకంలో గ్రామ ఉపసర్పంచ్ పేరు లేకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం గ్రామ పంచాయతీ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు దుబ్బ నాగేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు గుడిగానిపల్లి రాజు మాదిగ హాజరై మాట్లాడారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళా ఉపసర్పంచ్ ను అవమానపరిచే విధంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఏఈ వ్యవహరించారని ఆరోపించారు. కుల వివక్ష ఇంకా కొనసాగడం బాధాకరమని, వెంటనే గ్రామసభ ఏర్పాటు చేసి తప్పును సరిదిద్ది న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పై అధికారుల దృష్టికి, అవసరమైతే మంద కృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, మాజీ సర్పంచ్ బాలస్వామి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దుబ్బ మైసయ్య, బహుజన నాయకులు శ్రీశైలం, అంజిబాబు, కానుగుల బుచ్చయ్య, వార్డు సభ్యులు దుబ్బ శ్రీశైలం, వెంకటయ్య గౌడ్, అల్లాడి చంద్రశేఖర్, దుబ్బ రాములు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప భక్తులకు శుభవార్త



- ఏళ్ల నాటి సోమసూత్రాన్ని పునరుద్ధరించిన పురావస్తు శాఖ
- ఈ నెల 12 నుండి వినియోగంలోకి సోమసూత్రం
- ఉదయం 6 నుండి 11 గంటల వరకు అభిషేకం చేసుకునేందుకు అవకాశం

**వెంకటాపూర్(రామప్ప ),అక్టోబర్ 10 (జనం సాక్షి):** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు పురావస్తు శాఖ శుభవార్త అందించింది. చాలా సంవత్సరాలుగా ప్రధాన గర్భాలయంలోని ప్రధాన సోమ సూత్రం వినియోగంలో లేకపోవడంతో భక్తులకు స్వామివారిని ఎక్కువ సమయం అభిషేకించుకునే అవకాశం లేకుండా పోయింది. దీనిని గమనించిన పురావస్తు శాఖ అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని సోమ సూత్రాన్ని పునరుద్ధరించి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు.దీంతో సోమ సూత్రాన్ని ఆశ్వయుజ శుద్ధ విదియ అయిన (ఈనెల 12న) సోమవారం నుండి వినియోగంలోకి తేనున్నారు. ఆరోజు నుండి ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు భక్తులందరూ తమ స్వహస్తాలతో ప్రధాన గర్భాలయంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి శివలింగానికి అభిషేకం చేసుకునే మహత్తర అవకాశం కల్పించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఇమ్మడి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలోతెలిపారు. అభిషేకం చేసుకోవాలనుకునే భక్తులు ఆలయ కార్యాలయంలో రూ. 201/- చెల్లించి రశీదు పొందాలని, సంప్రదాయ వస్త్రాలు అయిన ధోతి, కండువా ధరిస్తేనే గర్భాలయంలోకి అనుమతిస్తారని ఆయన పేర్కొన్నారు. కావున, భక్తులు అవకాశాన్ని సద్విని చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల చెందిన భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో శివయ్యకు చిలికరింపు అభిషేకాలు చేసేవాళ్ళమని, ఇకనుండి స్వామివారికి సంపూర్ణ అభిషేకం చేసేందుకు అవకాశం కల్పించినందుకు పురావస్తు శాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు చేశారు.

## మేడారం సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో
# బీజేపీలోకి యువత భారీ చేరికలు



**గోవిందరావుపేట (జనంసాక్షి) :** మండలంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లోకి భారీ సంఖ్యలో యువకులు చేరారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లుల సన్నిధిలో యువత పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీలో చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, సుపరిపాలన, దేశ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి పెరుగుతున్న గౌరవం పట్ల ఆకర్షితులై, దేశ భవిష్యత్తులో భాగస్వాములు కావాలనే ఆశయంతో యువకులు బీజేపీలో చేరారు. ఈ చేరికలకు ప్రోత్సాహం అందించిన బీజేపీ కార్యకర్తలు పర్రెం రఘుపతి రెడ్డి , బండి వేణు, అజిమిరా జీవహర్ లాల్, ఇర్సవడ్ల వినయ్, యువతను పార్టీ వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరికొండ బలరాం. జిల్లా జెండ్రల్ ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్ రాష్ట్ర నాయకురాలు గుగులోత్ స్వరూప అధ్యక్షతన, గోవిందరావుపేట మండల బీజేపీ అధ్యక్షుడు మార్క సతీష్ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది.

# ఆక్రమణకు గురవుతున్న బతుకమ్మ, కనకదుర్గమ్మ, మడేలయ్య ఆలయాల స్థలాలను కాపాడాలి

చెన్నారావుపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి) : ఆక్రమణకు గురవుతున్న మగ్దంపురం గ్రామంలోని సర్వే నెంబర్ 300లలోని ప్రభుత్వ భూమిలో ఉన్న బతుకమ్మ ఆటస్థలం, కనకదుర్గమ్మ గుడి, మడేలయ్య గుడి స్థలాలను కాపాడాలని మగ్దంపురం గ్రామ 11వ వార్డు కౌన్సిలర్ చీకటి స్వరూప ఓదయ్య గౌడ్, మాజీ సర్పంచులు పెండ్యాల జ్యోతి ప్రభాకర్, కోన్ రెడ్డి అరుణ శ్రీనివాసరెడ్డి, ఆకులపెల్లి మల్లేశం, కున్ సోత్ సారమ్మ సారయ్య, మాజీ ఎంపిటిసి అర్షనపెల్లి వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట తహసిల్దార్ కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సర్వేనెంబర్ 300లలోని ప్రభుత్వ భూమిలో గత కొద్ది సంవత్సరాలుగా బతుకమ్మ ఆడుకుంటున్నామని ఇదే స్థలంలో కనకదుర్గమ్మ, రజక కులస్తుల మడేలయ్య ఆలయాల స్థలాలు ఉన్నాయన్నారు. కొందరు వ్యక్తులు చుట్టూ ఉన్న స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నారన్నారు. ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేయించి బతుకమ్మ ఆట స్థలం, కనకదుర్గమ్మ గుడి, మడేలయ్య గుడి స్థలాలను ప్రైవేటు వ్యక్తుల కబ్జాల నుండి కాపాడి అట్టి ప్రభుత్వ భూమికి హద్దులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వరంగంటి కుమారస్వామి, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు చాపర్తి బిక్షపతి, బిజెపి గ్రామ అధ్యక్షులు వెల్దండి మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి, అక్టోబరు 10(జనంసాక్షి) మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు ఎంగిలి పూల బతుకమ్మను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద మహిళలు బతుకమ్మలతో తరలివెళ్లి ఆడారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ప్రకృతి ఇచ్చిన పూలను దేవతగా భావించిన మహిళలు ఆడి, పాడారు. తెలంగాణ సాంస్కతిక సంప్రదాలయాలు ఉట్టి పడేలా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. మహిళా శక్తికి ప్రతీకగా బతుకమ్మను ఆరాధిస్తారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు కొత్త దుస్తులు, పట్టు చీరలు దరించి కోలాటాలు నృత్యాలు చేసుకుంటూ. బతుకమ్మ పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో చెరువు వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బతుకమ్మలు నిమజ్జనం చేయడానికి చెరువులో నీరు లేకపోవడంతో పంచాయతీ ఆధ్వర్యంలో నక్కల తూము వద్ద ఉన్న లోతైనా గుంటలో పైపుల ద్వారా నీటిని రప్పించి నింపించారు. ఎలాంటి ఘటనలు జరుగకుండా ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్






**బెల్లంపల్లి, అక్టోబర్ 10, (జనంసాక్షి) :** దేశ ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డితో కలిసి సర్ ప్రక్రియలో అక్రమాలపై నిరసనగా బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, సర్ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ఓటర్ల నమోదు జరగాలని డిమాండ్ చేశారు. సర్ పేరుతో అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకొని, అవసరమైతే ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోండి..

- విద్యుత్ బిల్లును జీరోకు తగ్గించుకోండి!
- పీఎం సూర్య ఘర్ పథకం రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి..
- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈల విజ్ఞప్తి



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 10(జనం సాక్షి):** గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ను ఏర్పాటు చేసుకుని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.బిక్షపతి కోరారు.విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు సౌర విద్యుత్ ద్వారా ఇంటి అవసరాలకు అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు పీఎం సూర్య ఘర్–ముఫ్త్ బిజ్లీ యోజన ఒక మంచి అవకాశం అందించిందని పేర్కొన్నారు.

### సౌర విద్యుత్తుతో విద్యుత్ బిల్లులకు చెక్

ఇళ్ల పైకప్పులపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సూర్యరశ్మి సహాయంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చున్నారు. దీనివల్ల గ్రిడ్ నుంచి తీసుకునే విద్యుత్ వినియోగం తగ్గి, నెలవారీ విద్యుత్ బిల్లుపై గణనీయమైన ఆదా పొందే అవకాశం ఉందన్నారు. సోలార్ ప్లాంట్ సామర్థ్యం,ఇంటి విద్యుత్ వినియోగం, సౌర విద్యుత్ ఉత్పత్తి బట్టి విద్యుత్ బిల్లు జీరోకు చేరే అవకాశం కూడా ఉంటుం దని వివరించారు. బ్యాంకులు అతి తక్కువ వడ్డీ రేట్లకే రుణ సదుపాయం కల్పిస్తుందని , నెలవారి చెల్లించే సదుపాయం కూడా అందుబాటులో ఉందని చెప్పారు.

### కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు

పీఎం సూర్య ఘర్ పథకం కింద అర్హులైన గృహ వినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది.1 కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు: రూ.30,000 సబ్సిడీ,2 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌కు: రూ.60,000 సబ్సిడీ,3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి: గరిష్ఠంగా రూ.78,000 సబ్సిడీ, ఈ రాయితీల వల్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే ప్రారంభ వ్యయం తగ్గుతుంది. అర్హత, సాంకేతిక ప్రమాణాలు, పథకం నిబంధనలకు అనుగుణంగా సబ్సిడీ లభిస్తుంది.3 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ద్వారా అనుకూల పరిస్థితుల్లో నెలకు 360 యూనిట్ల పై మేరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. అయితే వాతావరణ పరిస్థితులు, పైకప్పుపై సూర్యరశ్మి లభ్యత, ప్లాంట్ పనితీరు ఆధారంగా ఉత్పత్తి మారుతుందన్నారు. ఇంటి విద్యుత్ వినియోగం సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు అనుగుణంగా ఉంటే విద్యుత్ బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు.

### దరఖాస్తు ప్రక్రియ సులభం

అర్హులైన గృహ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ https://pmsuryaghar.gov.in ద్వారా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్, ఆమోదిత విక్రేత ఎంపిక, సోలార్ ప్లాంట్ ఏర్పాటు, తనిఖీ, నెట్ మీటరింగ్, సబ్సిడీ పొందే ప్రక్రియను పథకం మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలి.సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే ముందు తమ ఇంటి విద్యుత్ వినియోగం, అవసరమైన ప్లాంట్ సామర్థ్యం, పైకప్పుపై అందుబాటులో ఉన్న స్థలం, మొత్తం వ్యయం, సబ్సిడీ అర్హత వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

### పర్యావరణ హితమైన విద్యుత్ వినియోగానికి ముందడుగు

రూఫ్‌టాప్ సోలార్ వినియోగం ద్వారా సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చు. ప్రతి అర్హమైన గృహ వినియోగదారుడు పీఎం సూర్య ఘర్ పథకాన్ని ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.

# దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళున్నందున ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దసరా పండుగను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరిగా ఉన్న ఇళ్ల పరిసరాల్లో పోలీసు గస్తీని పటిష్టం చేశామని తెలిపారు. రాత్రి వేళల్లో ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, బీట్ వ్యవస్థను బలోపేతం చేసి, అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్రయాణానికి వెళ్లే ముందు ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవాలని, విలువైన వస్తువులు, నగదు, బంగారాన్ని ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. తాము ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి, గ్రామ పెద్దలకు తెలియజేయడంతో పాటు, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. దసరా సెలవుల సమయంలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల చోరీలు, ఇళ్లలోకి చొరబడి నేరాలకు పాల్పడే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. గతంలో నేరాలు నమోదైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా, పెట్రోలింగ్ ముమ్మరం చేశామని వెల్లడించారు. ప్రజలు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని, ఇంటి తాళాలు, ప్రయాణ వివరాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల కదలికలు, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రాధాన్యత అని, పండుగ సెలవులను సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# రోడ్డుపై వేలాడుతున్న భారీ కొమ్మను తొలగింపు

- జనంసాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపిన బాటసారులు






**ఉట్నూర్, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** విరిగితే...ప్రాణాలకు ముప్పు అనే శీర్షికన జనం సాక్షి కథనం గత నెల 25న ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, పంచాయతీ ఈఓ శంకర్ లు జేసిబి సహాయంతో ప్రమాదకరంగా ఉన్న ఉట్నూర్ నుంచి ఎక్స్‌రోడ్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై హార్కపురం గ్రామ సమీపంలో భారీ చెట్టుకొమ్మను తొలగించారు. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణికులు, బాటసారులు ఈ భారీ చెట్టు కొమ్మ ఎప్పుడు ఎవరి మీద పడుతుందోనని భయంతో ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని ప్రయాణాలు చేశారు.ఈ భారీ చెట్టు కొమ్మను తీసివేయడం వల్ల హర్షం వ్యక్తం చేశారు. వార్త కథనంతోనే పెద్ద సమస్య తీరిందని ఈ సందర్భంగా పరిసర ప్రాంత ప్రజలు జనంసాక్షి దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు సిఓఈ విద్యార్థులు




**బెల్లంపల్లి, అక్టోబర్ 10, (జనంసాక్షి) :** రాష్ట్ర స్థాయి అండర్ 17 పాఠశాల క్రీడా సమైక్య ఫుట్బాల్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సెన్స్ లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి వినాయక్, పదవ తరగతి చదువుతున్న కోట సాయి రోహిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అకిడి విజయసాగర్ తెలిపారు. ఈనెల 4న బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో నిర్వహించిన జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపీ కావడం పట్ల విద్యార్థులకు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 12 నుంచి 14 వరకు సెయింట్ మార్ఫ్ట్ టౌన్ హై స్కూల్ హైదరాబాదులో జరుగుతాయని జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎండి యాకుబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చుక్కుర్తి రాజశేఖర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బస్సు దిగుతుండగా గుండెపోటు!

- ఆర్టీసీ ప్రయాణికుడు మృతి!

**పరకాల, అక్టోబర్ 10, (జనంసాక్షి):** పరకాల మండలం సీతారాంపురం శివారులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. బస్సు దిగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిన బాధితుడు.అంబాల - హనుమకొండ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన పరకాల మండలం సీతారాంపురం శివారులో చోటుచేసుకుంది.మృతుడిని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలానికి చెందిన బక్కి సంజీవ (52) గా గుర్తించారు. పితృ అమావాస్య సందర్భంగా పర్వతగిరిలోని తన తల్లిదండ్రులకు బియ్యం ఇవ్వడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సీతారాంపురం సమీపంలో రోడ్డు వర్క్ సూపర్వైజర్ గా పనిచేస్తున్న ప్రాంతంలో బస్సు దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీనిని గమనించిన ఆర్టీసీ సిబ్బంది, తోటి ప్రయాణికులు వెంటనే సీపీఆర్ చేశారు. అయినా ఫలితం లేకపోయింది. వెంటనే 108 కు, పోలీసులకు, డిపో మేనేజర్ కు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**దేవరుప్పుల, అక్టోబర్ 10 (జనం సాక్షి):** దేవరుప్పుల మండలం చిన్నమడూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మైదం జోగేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అవకాశం కల్పించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీఈఓ కృష్ణమూర్తి, సొసైటీ డైరెక్టర్ ముసి గుంపుల కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన నల్గొండ అదనపు కలెక్టర్



**వెంకటాపూర్(రామప్ప) అక్టోబర్ 10 (జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం నల్గొండ అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు బద్రు, అరుణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, పురావస్తు,దేవాదాయ,టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నీలం మధుకు ఎమ్మెల్సీ ఇవ్వాలి



**గండీడ్, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** పేదల సంక్షేమానికి కృషి చేస్తూ,ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న నీలం మధు ముదిరాజ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి టైగర్ రవీందర్ ముదిరాజ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.ప్రజాసేవలో ముందుండే నాయకులకు రాజకీయ గుర్తింపు ఇవ్వడంతోపాటు ముదిరాజ్ సామాజిక వర్గానికి సముచిత ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈసందర్భంగా నీలం మధు ముదిరాజ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పేదల సమస్యలపై అవగాహన కలిగి, కులమతాలకు అతీతంగా సేవలందిస్తున్న నీలం మధుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే బడుగు, బలహీన వర్గాల సమస్యలను శాసన మండలిలో వినిపించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి మేకల శివ, కొమిరెడ్డిపల్లి మూడో వార్డు సభ్యుడు మెంటే శ్రీనివాస్, జిలకరి శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- రాంరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే అండ, బలం
- ప్రజాసేవకే రాంరెడ్డి కుటుంబం తుది శ్వాస వరకు అంకితం
- ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి
- రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి

**కామేపల్లి, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి రామిరెడ్డి కుటుంబానికి అండగా నిలవాలని కార్యకర్తలను పట్టభద్రులను ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి,రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్ రెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని పాతలింగాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పట్టభద్రులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంతో నమ్మకంతో తమ కుటుంబానికి ఎమ్మెల్సీ టికెట్ ఖరారు చేసిందని తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతామని, రాంరెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడు కార్యకర్తలు అండగా ఉంటూ తన గెలుపులో తోడుంటుందన్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చి తాతల తరం నాటి నుండి కాంగ్రెస్ పార్టీలోనే



ఉంటున్నామని ప్రాణం పోయేంతవరకు కాంగ్రెస్ పార్టీ కె అంకితమై ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా తమపై నమ్మకం ఉంచి రాంరెడ్డి సోదరులకు పార్టీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేలుగా గెలిపించి మంత్రి పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ తమను నమ్మి ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చిందని కార్యకర్తలు తమను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని తన గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. ఎల్లప్పుడు ప్రజాసేవకే రాంరెడ్డి కుటుంబం అంకితమే ఉంటుందని కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. పట్టభద్రులు ఓటు కోసం నమోదు చేసుకోవాలని తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీకి వేసి తమ గెలుపులో భాగస్వాములు కావాలని కోరారు. తన గెలుపును దివంగత మంత్రులు రాంరెడ్డి వెంకటరెడ్డి, రాంరెడ్డి దామోదర్ రెడ్డికి అంకితం ఇస్తామని అన్నారు. వారు ఈ లోకంలో లేకున్నా తమ ఆశీస్సులు తమకున్నాయని వారి ఆశీస్సులతోనే భారీ మెజార్టీతో గెలుపొందుతామని అన్నారు.తమ గెలుపు కోసం రాష్ట్రంలో ఉన్న మంత్రులు నాయకులు ఏకమై కలిసికట్టుగా పనిచేయడం ఎంత ఆనందంగా ఉందన్నారు. కార్యకర్తలు తమ గెలుపు కోసం సైనికుల పనిచేసే ప్రతి పట్టభద్రుడు తమకు ఓటు వేసే విధంగా కృషి చేయాలని ఎల్లప్పుడూ వారికి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డిసిసి అధ్యక్షులు గూడపాటి నరసయ్య,రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి,రాంరెడ్డి చరణ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, నాయకులు సుజాత మంగీలాల్, సర్పంచులు ఇట్టా శ్రీనివాసరావు, లాకావత్ సునీత, అనురాధ. కమల,ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, మాజీ ఎంపిటిసీ నల్లమోతు లక్ష్మయ్య,రాంరెడ్డి జగన్నాథ రెడ్డి సర్పంచులు, నాయకులు ఆల్ శివ. తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ

- సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ పాట సీడీని ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత

**హయత్ నగర్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రపంచంలో పూలను పూజించే సంప్రదాయం తెలంగాణలో ప్రత్యేకతను సంతరించుకుందని, పూలనే దేవతలుగా భావించి ఆరాధించే గొప్ప సంస్కృతి తెలంగాణకు సొంతమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు సంబరంగా జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. ఏ1 టీవి తెలుగు న్యూస్ సమర్పణలో రూపొందించిన 'సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ' పాట సీడీని కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత, దర్శకుడు కోదారి శ్రీనివాస్ ఈ పాటను రచించగా, ప్రముఖ గాయని మమతా రమేష్ ఆలపించారు. నీరజ్ కీస్ సంగీతం అందించగా, బాలు డీఓపీ బాధ్యతలు నిర్వహించారు. శాండి కొరియోగ్రఫీ అందించగా, డ్యాన్సర్ సాజన్య తన నృత్యంతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జానపద కళాకారుడు గజ్జల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ పాట రూపుదిద్దుకుంది. పాటను



వీక్షించిన కవిత బాగుందని అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ పాటను రూపొందించిన బృందాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏ1 టీవి తెలుగు న్యూస్ చైర్మన్ బీవీ బాలకృష్ణ, అవుట్‌పుట్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు ఇస్మాయిల్, ఎంఎన్ తిరుమలరావు, టెక్నికల్ హెడ్ చైతన్య, రిపోర్టర్ దిండిగాల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

**పి.ఏ.పల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు,శారీరక దృఢత్వం, క్రమశిక్షణను అలవర్చుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అంగడిపేట గ్రామ సర్పంచ్ రమావత్ చిరంజీవి,బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు వడత్య రమేష్ నాయక్ అన్నారు. అంగడిపేట గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.క్రీడలు యువతలో పట్టుదల,ఐకమత్యం,నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి టోర్నమెంట్లు మంచి వేదికలుగా నిలుస్తాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని,ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడి తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో అజ్మాపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ,వంగాల వెంకట్ రెడ్డి,పాండు నాయక్,నెల్సన్,రాగ్యా నాయక్,చారి క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు,గ్రామ యువకులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు 86 మంది గిరిజన విద్యార్థులు

- విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపునకు ప్రోత్సాహం
- ఐటీడీఏ పీఓ బి. రాహుల్



**భద్రాచలం, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌ను వీక్షించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి విలువిద్య క్రీడాకారుల నుంచి స్ఫూర్తి పొందేందుకు గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలలకు చెందిన 86 మంది విద్యార్థినీ విద్యార్థులను హైదరాబాద్‌కు పంపించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. శనివారం కాచనపల్లి క్రీడా పాఠశాలకు చెందిన 43 మంది బాలికలు, కిన్నెరసాని క్రీడా పాఠశాలకు చెందిన 43 మంది బాలురు పీడీ, పీఈటీ, ఏఎస్ఓల పర్యవేక్షణలో హైదరాబాద్‌కు బయలుదేరారు. విలువిద్య ప్రీమియర్ లీగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని, విలువిద్యలో రాణించి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే ఆకాంక్ష బలపడుతుందని పీఓ పేర్కొన్నారు. విద్యార్థులకు లీగ్‌లో పాల్గొనేందుకు అనుమతి మంజూరు చేసి, బస్సు సౌకర్యం కల్పించిన ఐటీడీఏ పీఓ బి. రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ చందనకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విలువిద్యను ప్రోత్సహిస్తూ సహకారం అందించిన ఆర్చరీ ప్రీమియర్ లీగ్ చైర్మన్, నిర్వాహక బృందం, ఉమ్మడి ఖమ్మం జిల్లా విలువిద్య సంఘానికి క్రీడా అధికారి గోపాలరావు, ఏఎస్ఓ వెంకటనారాయణ, సోయం నాగేశ్వరరావు, రాంబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# యువతి అదృశ్యం

- ఆచూకీ కోసం తండ్రి ఫిర్యాదు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం పూసల తండా గ్రామానికి చెందిన నుంసావత్ మత్రూ (49) తన పెద్ద కుమార్తె నుంసావత్ విగ్నేశ్వరి (25) అదృశ్యమైనట్లు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుడు అందించిన వివరాల ప్రకారం.. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె విగ్నేశ్వరి ఇంటర్మీడియట్ వరకు చదువుకొని, ప్రస్తుతం తల్లిదండ్రులతో కలిసి ఉంటూ కూలి పనులకు వెళ్తోంది. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్ 29వ తేదీన ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో తనకు ఆరోగ్యం బాగోలేదని, పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్ళింది. అయితే సాయంత్రం అయినప్పటికీ ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో గాలించడంతో పాటు, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. అయితే, కోడిపుంజుల వాగు గ్రామానికి చెందిన లకావత్ రాంప్రసాద్ (26) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా తన కుమార్తె వెంట పడుతున్నాడని, అతనే మాయమాటలు చెప్పి తన కుమార్తెను బలవంతంగా తీసుకెళ్లి ఉండవచ్చని తండ్రి తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ యువతి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే వెంటనే పాల్వంచ రూరల్ పోలీసులకు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించవలసిందిగా కోరారు.

# గౌతమి గోల్డ్ పత్తి రకంతో అధిక దిగుబడి

- నాగసంపల్లిలో వేద సీడ్స్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ప్రదర్శన



**కోట్‌పల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలోని నాగసంపల్లి గ్రామంలో రైతు చెన్నారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వేద సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో గౌతమి గోల్డ్ పత్తి రకంపై క్షేత్రస్థాయి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంట సాగు విధానం, రకం ప్రత్యేకతలు, దిగుబడి అవకాశాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వేద సీడ్స్ జనరల్ మేనేజర్ నరేంద్రబాబు మాట్లాడుతూ.. గౌతమి గోల్డ్ పత్తి రకం పెద్ద, బరువైన కాయలను కలిగి ఉంటుందని తెలిపారు. రసం పీల్చే పురుగులను తట్టుకునే లక్షణం ఈ రకంలో ఉందని, దగ్గర దగ్గరగా నాటుకునే సాగు విధానాన్ని అనుసరించే రైతులకు మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సాగు చేస్తే ఎకరాకు సుమారు 12 క్వింటాళ్ల దిగుబడి సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు పంట సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ, నిపుణుల సూచనల మేరకు ఎరువులు, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయి ప్రదర్శన ద్వారా పత్తి రకం లక్షణాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం రైతులకు లభించింది. ఈ కార్యక్రమంలో వేద సీడ్స్ ప్రతినిధులు, జోన్ ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి, ప్రభు, రవీందర్‌రెడ్డి, వెంకన్న, స్థానిక డీలర్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**దమ్మపేట, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ శనివారం దమ్మపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,నిర్వహణ, పారిశుధ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితులతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, వారికి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.క్రైమ్ ప్రాపర్టీ భద్రత, నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన



కల్పించాలని,పెట్రోలింగ్,బ్లూకోల్ట్స్ వాహనాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.డయల్ 112కు ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ,వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఖమ్మంలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

- రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల ప్రారంభం

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 9, 12, 13, 14వ డివిజన్లలో రూ.1.55 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ నగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇంకామిగిలి ఉన్న చిన్న, చిన్న పనులను కూడా రానున్న రోజుల్లో చేపట్టి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు వచ్చేలా అభివృద్ధి పనులు



చేపడుతున్నామని పేర్కొన్నారు. మిగిలి ఉన్న చిన్న, చిన్న పనులను కూడా గుర్తించి దశల వారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని మంత్రి సూచించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులు పూర్తి చేయాలని తెలిపారు.పుట్టపాక నుంచి రాజన్నపేట వరకు రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయించి, పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటా మని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, వాటి వివరాలను సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మిగిలిన పనులను కూడా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. ఖమ్మం నగరంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన ప్రజలంతా సుఖ సంతోషాలతో, పరస్పర సోదరభావంతో కలిసి మెలిసి జీవించేలా నగరాన్ని తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నానని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ, నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల విద్యుత్ అందించి రైతులను ఆదుకోండి

- పొలంలో ఎడ్లను మేపుతూ రైతుల నిరసన

**చేర్యాల, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** రైతాంగానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ అందించి ఆదుకోవాలని బాధిత రైతులు శనివారం మండలంలోని ఆకునూరు గ్రామంలో ఎండిపోయిన వరి చేనులో ఎడ్లను మేపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కంతుల నర్సయ్య మాట్లాడుతూ.. తాను పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండిస్తున్న వరి పంట వేస్తే, చేతికందే దశలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక నీళ్లు అందక పంట చేను పూర్తిగా ఎండిపోయిందని, ఇలాంటి పరిస్థిలో పంట పండిన పండకపోయిన కౌలు ఇవ్వక తప్పదు,లక్షల్లో పెట్టుబడి పెట్టి ఎండిన పొలంలో పోసినట్టు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కనీసం 15 గంటలు అయినా విద్యుత్ ను అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు శెట్టె మల్లయ్య, సందబోయిన వెంకటేష్, పస్తం మల్లేష్, కనకయ్య, రాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటిపై సోలార్.. విద్యుత్ బిల్లులకు చెక్!

- పీఎం సూర్య ఘర్ పథకంతో రూ.78 వేల వరకు సబ్సిడీ
- అర్హులైన గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి : టీజీఎస్పీడీసీఎల్



**ముషీరాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** గృహ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించడంతో పాటు సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అర్హులైన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సూచించింది. ఈ పథకం కింద ఇంటి పైకప్పుపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే గరిష్ఠంగా రూ.78 వేల వరకు కేంద్ర సబ్సిడీ పొందవచ్చని వెల్లడించింది.

**మూడు కిలోవాట్లకు రూ.78 వేల సబ్సిడీ**

పథకం నిబంధనల ప్రకారం మొదటి రెండు కిలోవాట్లకు కిలోవాట్‌కు రూ.30 వేల చొప్పున, మూడో కిలోవాట్‌కు రూ.18 వేల సబ్సిడీ లభిస్తుంది. దీంతో మూడు కిలోవాట్ల సోలార్ వ్యవస్థకు గరిష్ఠంగా రూ.78 వేల ఆర్థిక సహాయం అందుతుంది. అంతకు మించిన సామర్థ్యానికి అదనపు సబ్సిడీ ఉండదు. నివాస సముదాయాల్లో ఉమ్మడి విద్యుత్ అవసరాలకు కూడా నిర్దేశిత నిబంధనల ప్రకారం సబ్సిడీ పొందవచ్చు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు.. నేరుగా బ్యాంకు ఖాతాలో సబ్సిడీ**

అర్హులైన వినియోగదారులు జూఎంబతీఘ్రుస్త్రఘ్రుతీ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్, విద్యుత్ కనెక్షన్ వివరాలతో నమోదు చేసుకోవాలి. అనుమతి పొందిన అనంతరం పథకంలో నమోదైన విక్రేత ద్వారా సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. నెట్ మీటరింగ్, తనిఖీ, కమిషనింగ్ ప్రక్రియ పూర్తయి అర్హత నిర్ధారణ అయిన తర్వాత సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

**దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసిన సంస్థ**

వినియోగదారులకు ఇబ్బందులు తగ్గించేందుకు టీజీఎస్పీడీసీఎల్ పలు సదుపాయాలు కల్పించింది. 10 కిలోవాట్ల వరకు సోలార్ వ్యవస్థలకు సాంకేతిక సాధ్యతా అధ్యయనం నుంచి మినహాయింపు, ఆటోమేటిక్ లోడ్ పెంపు వంటి సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. నిర్దేశిత నిబంధనల మేరకు దరఖాస్తు ఫీజు మినహాయింపుతో పాటు తనిఖీ ప్రక్రియను కూడా సులభతరం చేసింది. అక్టోబర్ 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన సేవా సేతు శిబిరాల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, మొబైల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించింది.

**20.33 లక్షల ఇళ్లకు సోలార్ లక్ష్యం**

రాష్ట్రవ్యాప్తంగా యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ కార్యక్రమం కింద 20.33 లక్షల గృహాలకు 4,066 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 10,11,533 గృహాలకు 2,023 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. గృహజ్యోతి పథకాన్ని పీఎం సూర్య ఘర్‌తో అనుసంధానించారు. గ్రామాల సోలారైజేషన్ కార్యక్రమంలో భాగంగా 80 గ్రామాల్లో 40,349 గృహాలకు సోలార్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

**831.872 మెగావాట్ల సోలార్ విద్యుత్ సామర్థ్యం**

అక్టోబర్ 9, 2026 నాటికి టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో వివిధ కార్యక్రమాల ద్వారా 79,976 నమోదులు జరగగా, 62,818 సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. నెట్ మీటరింగ్ విభాగంలో 29,777, పీఎం సూర్య ఘర్ పథకంలో 29,816, మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమంలో 3,190 వ్యవస్థలు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 831.872 మెగావాట్లకు చేరినట్లు పేర్కొంది.

**హరిత తెలంగాణకు సౌర విద్యుత్ తోడ్పాటు**

రూఫ్‌టాప్ సోలార్ ద్వారా గృహ వినియోగదారులు తమ విద్యుత్ అవసరాల్లో కొంత భాగాన్ని సొంతంగా ఉత్పత్తి చేసుకోవచ్చని సంస్థ తెలిపింది. దీనివల్ల సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని పేర్కొంది.
టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, అర్హులైన వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ఇళ్లపై సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకుంటూ స్వచ్ఛమైన ఇంధన వినియోగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం సమీప విద్యుత్ సెక్షన్ లేదా డివిజన్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి

- ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్
- ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన.. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- ఆందోళనకు సంఘీభావం తెలిపిన సీపీఐ నాయకులు

**పెద్దపల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా నాయకులు సంఘీభావం ప్రకటించారు.
ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక నాయకులు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను జాబితా నుంచి తొలగించడం ప్రజల ఓటు హక్కుకు విఘాతమని ఆరోపించారు. ఇప్పటికే 13 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు పేర్కొంటూ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో గతంలో అనుసరించిన విధానాన్ని పునరుద్ధరించి, ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని లేదా ఆయనను బర్తరఫ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జామా మసీదు మౌలానా మహమ్మద్ అజీముద్దీన్ అహ్మద్, ముస్లిం నాయకులు సయ్యద్ మస్రత్, అబ్దుల్ హై జావిద్, ఎంఏ మొహీద్, కౌన్సిలర్లు మీర్జా షంషేర్ బేగ్, అస్లాం పర్వేజ్, సల్మాన్, అష్రాఫ్, యూనిస్ ఖాన్, నదీమ్, రఫీ ఉల్లా ఖాన్, మెహరాజ్, ఇమ్రాన్, బొడ్డుపల్లి శ్రీను, భూతగడ్డ సంపత్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బాలసాని లెనిన్, పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, కుక్క శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి,అక్టోబర్ 10(జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో హౌసింగ్ అధికారులతో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు,నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ పంపిణీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి, ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మొదటి జాబితాలో మంజూరైన ఇళ్లలో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పురోగతి లేని ఇళ్లను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనులు ప్రారంభం కాని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులతో సంప్రదించి, పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలను తెలుసుకుని, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొదటి జాబితాలో ఇప్పటివరకు మార్కింగ్ పూర్తి కాని ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే మార్కింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మార్కింగ్ పూర్తయిన ఇళ్లలో నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ పనులు ప్రారంభించేలా చూడాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్న వివరాలను సేకరించి, ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులకు పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను వివరించి, ఇళ్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ పవన్ కుమార్, డిప్యూటీ ఈఈ దస్తగిరి, ఏఈ లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బైకును ఢీకొని వ్యక్తి మృతి

**కొందుర్గు జనంసాక్షి :** మండల పరిధిలో శనివారం చోటుచేసుకున్న ఒక రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ముట్పూర్ గ్రామానికి చెందిన ధనసిరి మల్లయ్య (38) శనివారం తన వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లారు. ఈ క్రమంలో రేగిడి చిలకమర్రి గ్రామ శివారుకు చేరుకోగానే రోడ్డు పై ఉన్న ఒక బైకును ఆయన ప్రయాణిస్తున్న వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో మల్లయ్యకు శరీర భాగాలపై తీవ్రమైన గాయాలయ్యాయి. రక్తస్రావం ఎక్కువగా కావడంతో గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే దురదృష్టవశాత్తు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

## ఫోన్ కొనివ్వలేదని అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

- చిలుకానగర్‌లో ఘటన.. ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఆందోళన
- ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు.. స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద గాలింపు

**ఉప్పల్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** తల్లిదండ్రులు మొబైల్ ఫోన్ కొనివ్వలేదని అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకానగర్ న్యూ రామ్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికంగా నివసించే వినవంక శివశంకర్ కుమారుడు వినవంక ప్రశాంత్ (15) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మొబైల్ ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులను కోరగా, పరీక్షలు పూర్తయిన తర్వాత కొనిస్తామని చెప్పినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ప్రశాంత్ అక్టోబర్ 9న ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లతోపాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి బాలుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ప్రశాంత్ ఆచూకీ తెలిసినవారు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి

- చికితను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలి
- క్రీడారంగ అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం
- పది జట్లతో పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి టోర్నీ



**సుల్తానాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** క్రీడారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయిస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎదిగి రెండు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తెచ్చిన చికితను ఆదర్శంగా తీసుకొని యువ క్రీడాకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సీజన్-2ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం టాస్ వేసి పోటీలకు శ్రీకారం చుట్టారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులను అధిగమించి క్రీడల్లో రాణించిన చికిత దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. సుల్తానాబాద్ క్రీడలకు పుట్టినిల్లని, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. యువతను ప్రోత్సహించేందుకు ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనల మేరకు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి పది జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు బిరుదు రాధాకృష్ణ, నూగిళ్ల మల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాశ్ రావు, వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్ రావు, పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆటో మీటర్ చార్జీ కిలోమీటర్‌కు రూ.18 చేయాలి

- జీవో 46ను సవరించాలి..ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి
- ఆజాద్ ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మసీద్



**ముషీరాబాద్, అక్టోబర్10 (జనం సాక్షి):** ఆటో డ్రైవర్ల మీటర్ చార్జీలకు సంబంధించిన జీవో నంబర్ 46ను సవరించి, కిలోమీటర్‌కు రూ.18 చార్జీ లభించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆజాద్ ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మసీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇందిరాపార్క్ వద్దకు ధర్నా చౌక్ లో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆటో డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మసీద్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల జీవనోపాధిని, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మీటర్ చార్జీలను పెంచాలని కోరారు. హైదరాబాద్‌లో సరైన పర్మిట్లు లేకుండా తిరుగుతున్న ఆటోలపై చర్యలు తీసుకోవాలని, వైట్ ప్లేట్ బైక్ టాక్సీల అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రవాణా శాఖ మంత్రి వెంటనే డ్రైవర్ల ప్రతినిధులతో చర్చలు జరపాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలను కొనసాగిస్తామని, రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా తమ నిరసనను తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మల్లేష్, మహమ్మద్ అల్లా బకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉస్మాన్ బీమ్ అల్వగి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఓమర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఆర్చర్ చికితకు బండారు దత్తాత్రేయ సన్మానం

**2028 ఒలింపిక్స్‌కు తొలి కోటా సాధించడం గర్వకారణం**



**ముషీరాబాద్, అక్టోబర్ 10 (జనం సాక్షి):**
ఇటీవల జపాన్‌లో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఆర్చరీ మహిళల జట్టు, మిక్స్‌డ్ జట్టు విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన తెలంగాణ యువ ఆర్చర్ తనిపర్తి చికితను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం హైదరాబాద్‌లోని రాంనగర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన చికిత సామాన్య రైతు కుటుంబం నుంచి ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో రెండు స్వర్ణ పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగానికి భారతదేశానికి తొలి ఒలింపిక్ కోటా సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. 2025లో స్వర్ణ పతకం సాధించిన చికిత, 2026 ఆసియా క్రీడల్లో మరో రెండు స్వర్ణ పతకాలు సాధించడం ఆమె విలువిద్యలో చూపుతున్న నైపుణ్యం, పట్టుదల, కృషికి నిదర్శనమని అన్నారు. భారతీయ సంస్కృతిలో విలువిద్యకు ప్రాచీన కాలం నుంచి విశిష్ట స్థానం ఉందని, అలాంటి క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న చికిత తెలంగాణ బిడ్డ కావడం గర్వకారణమని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడిస్తున్న చికితకు బండారు దత్తాత్రేయ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు.. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి

**చేవెళ్ల సీఐ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్‌రెడ్డి**

**చేవెళ్ల, అక్టోబరు 10 (జనంసాక్షి)**

ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చేవెళ్ల సీఐ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఆర్ఎక్స్‌వర్ట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన ప్రజలకు ఎనిమిది రకాల ఆధునిక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.
అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ముందస్తుగా గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ పట్నాయక్, వైద్యులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి



**మర్పల్లి అక్టోబర్ 10 (జనంసాక్షి)** పంటకు చెట్టుకొమ్మలు అడ్డుగా ఉన్నాయని కమ్మ కత్తితో చెట్టు కొమ్మలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై ఉన్న కరెంటు తీగలకు కమ్మ కత్తి తగిలి విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన కొంశేట్ పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మర్పల్లి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొంశేట్ పల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం (55) కుటుంబ సభ్యులతో పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లారు. కుమారుడు పంటకు నీళ్లు పెడుతుం డగా శ్రీశైలం కమ్మ కత్తి తీసుకొని చెట్టు కొమ్మలను సాఫ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కమ్మ కత్తి విద్యుత్ తీగాలకు తలిగి విద్యుత్ షాక్ తో అక్కడే కిందపడ్డాడు. ఆయనను వెంటనే ఆటోలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు రాగా, అక్కడ డాక్టరు పరిష్కరించి అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు.

## అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది చోరీలు
- జైలులో పరిచయం.. బయటకు వచ్చాక ముఠాగా ఏర్పాటు
- రూ.21.05 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- నలుగురు నిందితులను పట్టుకున్న పోలీసులు



**మర్రిగూడ, అక్టోబర్ 10 (జనంసాక్షి):** నల్లగొండ జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను మర్రిగూడ, చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురు నిందితుల నుంచి సుమారు 11 తులాల బంగారం, 1.5 కిలోల వెండి, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.21.05 లక్షలు ఉంటుందని దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక నిఘా చేపట్టారు. ఇందులో భాగంగా అక్టోబర్ 10న నాంపల్లి సర్కిల్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, దేవరకొండ, కనగల్, నకిరేకల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది చోరీలకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది.
ప్రధాన నిందితుడిగా పేర్కొన్న బొల్లెమోని అంజి అలియాస్ స్వామి గతంలో చోరీ కేసుల్లో జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. జైలులో పరిచయమైన మరో ముగ్గురితో కలిసి విడుదలైన తర్వాత ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. పగటిపూట తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని సొత్తు దొంగిలించేవారని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో వనపర్తికి చెందిన బొల్లెమోని అంజి అలియాస్ స్వామి (29), హైదరాబాద్ బోరబండకు చెందిన పూజారోల్ల శివకుమార్ అలియాస్ శివయ్య (23), వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాలకు చెందిన సంపంగి రాజు అలియాస్ రాము (30), మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన గోపి అరుణ్‌కుమార్ (23) ఉన్నారు. కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన మర్రిగూడ ఎస్ఐ బి. రాంబాబు, చింతపల్లి ఎస్ఐ ఎం. రామ్మూర్తి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. ప్రజలు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణారావు



**పెద్దపల్లి,అక్టోబర్ 10(జనంసాక్షి) :** సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలోని డాక్టర్ విజయ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో ఆయన ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు తమ చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి తమ సమస్యలను వివరించగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమాజానికి,ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు యూనియన్లు, సంఘాలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులంతా కలిసి ఒక ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆ కమిటీ ముందుకు వస్తే అధికారులతో మాట్లాడి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. సుల్తానాబాద్,ఓదెల మండలాలతో పోలిస్తే పెద్దపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో స్థల లభ్యత కొంత క్లిష్టంగా ఉన్నప్పటికీ,అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల జాడను గుర్తించేందుకు అధికారులు నిరంతరం అన్వేషిస్తున్నారని వివరించారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా అనువైన ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, సంబంధిత సర్వే నంబర్లను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులకు సూచిస్తూ,అధికారులతో కలిసి సమష్టిగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పూర్తి భరోసా ఇచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

# నకిలీ దస్తావేజులతో ప్రభుత్వ భూమి ఆన్‌లైన్‌లో నమోదు?

- మాచ్నూర్‌లో 4 ఎకరాల 38 గుంటల భూమిపై ఆరోపణలు..
- అప్పటి తహసీల్దార్ పాత్రపైనా అనుమానాలు



**ఝరాసంగం, అక్టోబర్ 10 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మాచ్నూర్ గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గ్రామంలోని సర్వే నంబర్ 37లో ఉన్న 4 ఎకరాల 38 గుంటల భూమిని నకిలీ దస్తావేజుల ఆధారంగా ఆన్‌లైన్ భూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో అప్పటి తహసీల్దార్ పాత్రపైనా గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల ఆరోపణల ప్రకారం.. ప్రభుత్వం నుంచి భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన ధ్రువపత్రాలు పొందిన అసలు హక్కుదారుల పేర్లకు బదులుగా, ఇతరుల పేర్లు ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదయ్యాయి. ఇందుకు నకిలీ దస్తావేజులు సమర్పించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అసలు భూ హక్కుదారులకు అన్యాయం జరిగిందనే ఆందోళన నెలకొంది.

**సమగ్ర విచారణకు డిమాండ్**

సర్వే నంబర్ 37కు సంబంధించిన అసలు భూ రికార్డులు, ప్రభుత్వం జారీ చేసిన హక్కుల ధ్రువపత్రాలు, ఆన్‌లైన్ నమోదు సమయంలో సమర్పించిన దస్తావేజులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. భూమి హక్కుల మార్పిడిలో అక్రమాలు జరిగాయా? నకిలీ పత్రాల ఆధారంగా నమోదు చేశారా? అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అసలైన హక్కుదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# బస్తీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

**దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి: డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్**



హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి) : బస్తీ దవాఖానలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం నాంపల్లి క్లస్టర్ పరిధిలోని ఖైరతాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పూల్‌బాగ్ బస్తీ దవాఖానను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, వివిధ రికార్డులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అవసరమైన మందుల నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. గర్భిణుల సంరక్షణ, చిన్నారులకు టీకాల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి వ్యాధుల నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థంగా నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు.



## మార్గమధ్యంలో పంచరైన 108 అంబులెన్స్

- గర్భిణిని ప్రసవం కోసం తరలిస్తుండగా ఘటన
- జోగిపేట నుంచి మరో అంబులెన్స్ రప్పించిన పైలెట్

**పుల్కల్,అక్టోబర్ 10 (జనం సాక్షి):** అత్యవసర సమయంలో గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్ మార్గమధ్యంలో మొరాయించింది. శనివారం మధ్యాహ్నం పుల్కల్ నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి గర్భిణిని ప్రసవం కోసం తీసుకెళ్తుండగా తాడ్ దాన్‌పల్లి చౌరస్తా టోల్‌గేట్ సమీపంలో అంబులెన్స్ టైరు పంచరైంది. దీంతో గర్భిణిని ఆసుపత్రికి తరలించే క్రమంలో కొంత ఇబ్బంది ఎదురైంది.వెంటనే అప్రమత్తమైన అంబులెన్స్ పైలెట్ జోగిపేట నుంచి మరో 108 అంబులెన్స్‌ను రప్పించారు. అనంతరం గర్భిణిని మరో అంబులెన్స్‌లోకి మార్చి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్య సేవల్లో కీలకమైన 108 అంబులెన్స్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, ప్రయాణ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రివిలేజ్ ట్యాక్స్ జీవోను రద్దు చేయాలి

**తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ గౌడ్**



**ముషీరాబాద్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** బార్ అండ్ రెస్టారెంట్ యజమానులపై అదనపు ఆర్థిక భారం మోపే ప్రివిలేజ్ ట్యాక్స్ విధింపు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దామోదర్ గౌడ్ మాట్లాడుతూ, ఇప్పటికే బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు అధిక లైసెన్స్ ఫీజులు, నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీతాలు, వ్యాపారంలో తీవ్ర పోటీ వంటి సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో లైసెన్స్ ఫీజుల ఆధారంగా 8 శాతం నుంచి 16 శాతం వరకు ప్రివిలేజ్ ట్యాక్స్ విధించాలనే ప్రతిపాదన యజమానులపై మరింత ఆర్థిక భారాన్ని మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే, కొన్ని ప్రాంతాల్లో వైన్స్ షాపులకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూముల్లో నిబంధనలకు విరుద్ధంగా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేసి ఆహార విక్రయాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పర్మిట్ రూముల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టమైన నియంత్రణ తీసుకురావాలని, నిబంధనలను కఠినంగా అమలు చేసి చట్టబద్ధమైన బార్ అండ్ రెస్టారెంట్లకు సమానమైన వ్యాపార అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వైన్స్ షాపుల పర్మిట్ రూముల విషయంలో నిబంధనలు 25, 26ను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వం అనుమతించిన బార్ల పరిసరాల్లో బెల్ట్ షాపులను నిషేధించాలని కోరారు. ప్రివిలేజ్ ట్యాక్స్ విధించే జీవోను రద్దు చేసి బార్ అండ్ రెస్టారెంట్ యజమానులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ నిరాహార దీక్షలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, కోశాధికారి మోహన్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి రవీందర్ గౌడ్, నాయకులు బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయి పట్టివేత

- రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం.. మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు అరెస్ట్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10 (జనం సాక్షి) :**

కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 18 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన అశోక్ (26)ను అరెస్టు చేశారు.

దసరా నేపథ్యంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో ఎక్సైజ్, రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన అశోక్‌ను తనిఖీ చేయగా గంజాయి బయటపడింది.

ప్రాథమిక విచారణలో ఒడిశాలోని టిట్లాగఢ్ నుంచి గంజాయిని తీసుకొని సోలాపూర్‌కు తరలిస్తున్నట్లు నిందితుడు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల వివరాలను తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోంది.

జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలపై నిఘా కొనసాగిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523కు తెలియజేయాలని సూపరింటెండెంట్ ముకుందరెడ్డి కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# సమాచార హక్కు చట్టం దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ బి శ్రీరాములు**

**పెద్దపల్లి,అక్టోబర్ 10(జనంసాక్షి) :** సమాచార హక్కు చట్టం-2005 కింద అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని అదనపు కలెక్టర్ బి శ్రీరాములు అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి శ్రీరాములు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, అక్టోబర్ 5 నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు వారోత్సవాలు-2026 నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సమాచార హక్కు చట్టం కింద పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తమకు నిర్దేశించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో తెలుసుకొని విధులు నిర్వహించాలని ఆదేశించారు. చట్టం ప్రకారం ప్రజలకు అందించాల్సిన సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు.సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.అధికారుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కు దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోయినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బండి ప్రకాష్, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు ఈశ్వర్, డిఈఓ శారద, జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ నాయుడు, జిల్లా బిసి, ఎస్సి, మైనారిటీ, అధికారి ఎం. రవీందర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

**- కావలి చంద్రయ్య సూచన**

**కీసర, అక్టోబర్ 09 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య సూచించారు. నాగారం ఐదో డివిజన్ ఎస్సీ సెల్ చైర్మన్ పంగ శ్రీహరి శుక్రవారం చంద్రయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మెమొంటో అందజేసి సత్కరించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, పనిచేయాలని చంద్రయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కిష్టిగారి రవి, డివిజన్ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

# సెల్ టవర్ నిర్మాణం ఆపాల్సిందే!

- నాగారం బస్టాప్ వద్ద స్థానికుల ధర్నా
- పక్కనే ప్రభుత్వ పాఠశాల.. విద్యార్థుల భద్రతపై ఆందోళన
- ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం
- అనుమతులు, భవనం పటిష్ఠతపై తనిఖీలు చేయాలని డిమాండ్



**కీసర, అక్టోబర్ 9 (జనంసాక్షి):** జనావాసాల మధ్య చేపట్టిన సెల్‌ఫోన్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నాగారం వాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం మెయిన్ రోడ్డులో రాందేవ్ జువెలరీస్ పక్కన భవనంపై చేపట్టిన రూఫ్‌టాప్ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం నాగారం బస్టాప్ వద్ద ధర్నా నిర్వహించారు.

టవర్‌కు సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. టవర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? భవనం అదనపు భారాన్ని తట్టుకోగలదా? అగ్నిమాపక భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.

నిర్మాణంపై ఇప్పటికే ఘట్‌కేసర్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపించారు. టవర్‌కు సంబంధించిన డీఓటీ అనుమతులు, విద్యుదయస్కాంత క్షేత్ర (ఈఎంఎఫ్) రేడియేషన్ కొలతల నివేదికలు, భవనం నిర్మాణ సామర్థ్యాన్ని తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చర్యలు తీసుకోవాలని, అప్పటివరకు నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు. ఆందోళనలో అక్కాల సురేశ్‌కుమార్, శిలాసాగరం నాగేంద్ర, అన్నంరాజు అర్జున్, ఎదనోరి సాయి ఋషి, శరత్, సంపత్, వినోద్, మల్లేశ్, రాకేశ్, సాయికిరణ్, సాయిప్రసాద్, మామిళ్ల కృష్ణ, పోచయ్య, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కల్పనలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్

*శాశ్వత ఆస్తుల నిర్మాణంలో బెస్ట్*

- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ
- ప్రణాళిక ప్రకారం జిల్లాలో వీబీజీ రామ్ జీ పనులు
- జిల్లాలో జూలై నుంచి ఇప్పటివరకు 4,02,360 పని దినాలు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఉపాధి హామీ పనుల కల్పనలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు శాశ్వత ఆస్తుల నిర్మాణం, సహజ వనరుల సంరక్షణకు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలతో గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

జిల్లాలోని 260 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 98 వేల జాబ్ కార్డులు ఉండగా, ప్రస్తుతం రోజుకు 32,148 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. జూలై 1 నుంచి అక్టోబర్ 9 వరకు 4,02,360 పని దినాలు కల్పించారు. చెరువుల్లో పూడికతీత, మట్టి రహదారుల నిర్మాణం, ఫామ్ పాండ్లు, అటవీ భూముల్లో కందకాలు, మొక్కల పెంపకం, పశువులు, గొర్రెల షెడ్లు, కంపోస్టు షెడ్ల నిర్మాణంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల పనులు, సాగునీటి కాలువల మరమ్మతులు చేపడుతున్నారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి మొబైల్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు.

తెలంగాణ జలసిరి పథకం కింద వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు 210 ఫామ్ పాండ్లు, 1,769 మ్యాజిక్ సోక్ పిట్స్, 91 సామూహిక ఇంకుడు గుంతలు, 464 బోర్‌వెల్ రీచార్జ్ గుంతల పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ వేతనాల కింద రూ.12.90 కోట్లు చెల్లించగా, మెటీరియల్ కోసం రూ.76 లక్షలు కేటాయించారు. మెటీరియల్ విభాగంలో మరో రూ.7.37 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలో పనుల పురోగతి, ఉపాధి కల్పనలో సాధించిన ఫలితాలపై రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు.

# నిజామాబాద్‌లో అక్రమ లేఅవుట్లకు శాశ్వత చెక్

- నుడా సంచలన నిర్ణయం
- నీటి వనరుల ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనే ప్రాతిపదికగా
- పానుగంటి గంగారెడ్డి డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతిని రద్దు చేసిన నుడా వైస్ చైర్మన్ ఎస్. దిలీప్ కుమార్


OFFICE OF THE NIZAMABAD URBAN DEVELOPMENT AUTHORITY
Proceeding of the Vice Chairman, Nizamabad Urban Development Authority
Present :- Sri S. Dilip Kumar
Lr. No. 54/NUDA/2026 Dated:- -09-2026

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 10: జనం సాక్షి :**

నిజామాబాద్ జిల్లాలో రియల్ మాఫియా అక్రమాలకు, నిబంధనలను తుంగలో తొక్కి సాగిస్తున్న దందాలకు నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ గట్టి షాక్ ఇచ్చింది. సహజ నీటి వనరులను కబ్జా చేస్తూ, చెరువుల బఫర్ జోన్లను ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించడానికి యత్నించిన ఓ వివాదాస్పద లేఅవుట్ అనుమతిని నుడా యంత్రాంగం పూర్తిగా రద్దు చేసింది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, అధికారులను తప్పుదోవ పట్టించి పొందిన అనుమతులు ఎట్టకేలకు రద్దవడంతో స్థానికంగా సంచలనం సృష్టించింది.నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి మండలం, నడిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 319/ఏ/2/2 లోని 1 ఎకరం 24.8 గుంటల భూమిలో లేఅవుట్ ఏర్పాటు కోసం దరఖాస్తుదారు పానుగంటి గంగారెడ్డి ఆన్‌లైన్ 'టీజీ-బీపాస్' పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన జిల్లా లేఅవుట్ అప్రూవల్ కమిటీ నీటిపారుదల శాఖ డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన 'నిరభ్యంతర పత్రం' ఆధారంగా డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతులు మంజూరు చేసింది.అయితే, ఈ అనుమతుల వెనుక పెద్ద తప్పుదోవ పట్టించే తంతు నడిచిందన్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.

**బాధిత మహిళ ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం.**

ఈ లేఅవుట్ ఏర్పాటు వల్ల తమ భూములు కబ్జాకు గురవుతున్నాయని, సహజ నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తున్నారని పేర్కొంటూ బి. అజిత రెడ్డి నుడా కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. సహజ నీటి ప్రవాహాన్ని అక్రమంగా మూసివేశారని, నిబంధనల ప్రకారం పాటించాల్సిన 9 మీటర్ల బఫర్ జోన్‌ను విడిచిపెట్టకుండా ఆక్రమించుకున్నారని, కుంట ప్రాంతాన్ని కబ్జా చేయడమే కాకుండా, తప్పుడు సరిహద్దులతో తమ భూమిని అన్యాయంగా కలుపుకున్నారని ఆమె తన ఫిర్యాదులో స్పష్టం చేశారు.

**నీటిపారుదల శాఖ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు.**

బాధిత మహిళ ఫిర్యాదుపై స్పందించిన నుడా అధికారులు క్షేత్ర స్థాయి విచారణ జరపాల్సిందిగా నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. రంగంలోకి దిగిన ఇరిగేషన్ డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించగా పలు దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి.నిబంధనల ప్రకారం వదలాల్సిన 9.00 మీటర్ల బఫర్ జోన్‌లోనే శాశ్వత నిర్మాణాలతో పాటు సరిహద్దు గోడలను నిర్మించారు.ఇరిగేషన్ ఎన్‌ఓసిలో పొందుపరిచిన మార్గదర్శకాలను, షరతులను పూర్తిగా ఉల్లంఘించారు.దీంతో అప్రమత్తమైన నీటి పారుదల శాఖ అధికారులు, ఉల్లంఘనలను తొలగించాలంటూ డెవలపర్‌కు 15 రోజుల గడువుతో నోటీసులు జారీ చేశారు. కానీ డెవలపర్ నుండి ఎలాంటి స్పందన కరువైంది. దీంతో ఆగ్రహించిన ఇరిగేషన్ శాఖ గతేడాది మే 22వ తేదీనే సదరు లేఅవుట్‌కు ఇచ్చిన ఎన్‌ఓసీని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**కలెక్టర్ ఆదేశాలు నుడా తుది గడువు**

ఇరిగేషన్ ఎన్‌ఓసి రద్దు కావడంతో పాటు, జీఓఎంఎస్ నం. 105 నిబంధనలకు విరుద్ధంగా ఈ లేఅవుట్ కొనసాగుతున్నట్లు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ గుర్తించారు. ఈ మేరకు డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతిని రద్దు చేయాలని నుడాను ఆదేశించారు. దీని ఆధారంగా నుడా వైస్ చైర్మన్ స్పందిస్తూ గత ఆగస్టు 17న దరఖాస్తుదారు, డెవలపర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, అనుమతి ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. నిర్ణీత గడువు ముగిసినప్పటికీ డెవలపర్ నుండి ఎలాంటి వివరణ గానీ, పత్రాలు గానీ సమర్పించలేదు.

ఎలాంటి సమాధానం లేకపోవడంతో పాటు, ఇరిగేషన్ శాఖ ఎన్‌ఓసీ రద్దు, నిబంధనల ఉల్లంఘనలను పరిగణలోకి తీసుకున్న నుడా వైస్ చైర్మన్ ఎస్. దిలీప్ కుమార్ చట్టపరమైన అధికారాలను ఉపయోగించి పానుగంటి గంగారెడ్డికి ఇచ్చిన డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్ (L.P.No.290229/LP/GP/209388/0009/2023) ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు సంచలన ఉత్తర్వులు జారీ చేశారు.

**రియల్ ఎస్టేట్ వర్గాల్లో వణుకు.**

ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, తప్పుడు పత్రాలతో, అధికారులను తప్పుదోవ పట్టించి అనుమతులు పొందితే భవిష్యత్తులో ఏ విధంగా చర్యలు ఉంటాయో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో నడపల్లె పరిసర ప్రాంతాల్లో వెంచర్లు చేసే రియల్టర్లలో తీవ్ర వణుకు మొదలైంది. భవిష్యత్తులో ఈ రద్దయిన లేఅవుట్ ఆధారంగా ఎలాంటి క్రయవిక్రయాలు జరగకుండా నిజామాబాద్ రూరల్ సబ్-రిజిస్ట్రార్ కు, నడపల్లి పంచాయతీ కార్యదర్శికి నుడా అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

- జిల్లాలో 264 పోస్టుల భర్తీకి అవకాశం.. అక్టోబర్ 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- కొడంగల్ ప్రాజెక్టులో 13 టీచర్, 31 ఆయా పోస్టులు

**బొంరాస్‌పేట, అక్టోబర్ 10 (జనంసాక్షి):** జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 102 అంగన్‌వాడీ టీచర్, 162 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన మహిళలు అక్టోబర్ 10 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్నవారు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను అధికారుల ధ్రువీకరణతో సమర్పించాలి. కొడంగల్ ప్రాజెక్టు పరిధిలో 13 టీచర్, 31 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్ పోస్టులు బాలంపేట, బొంరాస్‌పేట, తుంకిమెట్ల, దుద్యాల, దౌల్తాబాద్ క్లస్టర్ల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్నాయి. ఆయా పోస్టులు దౌల్తాబాద్, బాలంపేట, తుంకిమెట్ల, కొడంగల్, దుద్యాల, హస్నాబాద్, రేగడిమైలారం, రుద్రారం, బొంరాస్‌పేట క్లస్టర్లలో ఖాళీగా ఉన్నాయి. పోస్టుల వారీగా అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## మల్కారం క్వారీలో విషాదం.. ఈతకు వెళ్లి ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



**జవహర్ నగర్ అక్టోబర్ 10 ( జనంసాక్షి) :** మల్కారం క్వారీలో ఈతకు వెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయి గూడలోని సాయిప్రియ కాలనీకి చెందిన ముమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17) చేర్యాలలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలకు వెళ్లిన అతడు సాయంత్రం స్నేహితులతో కలిసి మల్కారం క్వారీకి ఈత కోసం వెళ్లాడు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న తల్లి హేమలత అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు గాలించి ప్రణవ్ మృతదేహాన్ని బయటకు తీశాయి. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లి హేమలత కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యమంలో పోరాడాం.. ప్రాతినిధ్యం కల్పించండి!





- ఎమ్మెల్సీ అవకాశం కోసం జ్యోతి కిరణ్ వినతి
- మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఉద్యమకారులకు తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారిణి, అడ్వకేట్ జేఏసీ కో–కన్వీనర్, ప్రముఖ న్యాయవాది జ్యోతి కిరణ్ కోరారు. సిరిసిల్ల నుంచి పద్మశాలి సామాజిక వర్గానికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం మంత్రుల నివాసాలకు వెళ్లిన జ్యోతి కిరణ్ వారిని కలిసి తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించేలా సహకరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తాను క్రియాశీలకంగా పాల్గొన్నానని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో తన వంతు పాత్ర పోషించానని వివరించారు. రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారులకు ఆశించిన స్థాయిలో గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని పేర్కొన్నారు. ఉద్యమంలో పనిచేసిన వారి సేవలను గుర్తించి తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. సిరిసిల్ల ప్రాంతం నుంచి పద్మశాలి సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి ద్వారా ప్రాతినిధ్యం కల్పించాలన్న ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో, ఉద్యమ నేపథ్యం, న్యాయవాదిగా తన అనుభవం, ప్రజా ఉద్యమాల్లో తన పాత్రను పరిగణనలోకి తీసుకొని తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని జ్యోతి కిరణ్ మంత్రులను కోరారు. ఇదే విషయమై శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పద్మశాలి నాయకులతో కలిసి ఆమె కలిశారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మహిళా ఉద్యమకారిణిగా తన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.

# క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రాధాన్యం

- ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- కొరియా తరహాలో క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా అడుగులు
- ఐజీపీఎల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



తెలంగాణలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తుచేశారు.

హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఎన్‌డీటీవీ, ఏఎం గ్రీన్, ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) సంయుక్త ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్స్‌లో నిర్వహించిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆర్ అండ్ బి మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని తెలంగాణకు ముఖ్యమంత్రి ఆహ్వానించారని తెలిపారు. మెస్సీ ఫుట్‌బాల్ ఆడటంతో పాటు, హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రకటన కూడా వెలువడిందని పేర్కొన్నారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రాన్ని క్రీడా రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్రంలో క్రీడలు, ఇతర సంబంధిత కార్యకలాపాల పురోగతిపై సమీక్ష నిర్వహించారని చెప్పారు. దక్షిణ కొరియా వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాలు క్రీడల్లో వందలాది పతకాలు సాధిస్తున్న తీరును పరిశీలించాలని ఈ సందర్భంగా సూచించారని తెలిపారు. ఒకే విశ్వవిద్యాలయం వంద పతకాలు సాధించడం వెనుక ఉన్న శిక్షణా విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహకాలను అధ్యయనం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా దక్షిణ కొరియాలోని సంబంధిత విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, వైస్ ఛాన్సలర్‌తోపాటు క్రీడా అధికారులతో చర్చలు జరిపారని వెల్లడించారు. తెలంగాణ విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించేందుకు ఆ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాలని కోరినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి శిక్షణా విధానాలను అధ్యయనం చేసి, వాటిని రాష్ట్రంలో అమలు చేయాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

గోల్ఫ్ క్రీడ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రాంతానికి సమీపంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ నగరానికి మరింత ప్రాచుర్యం తీసుకువస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కొనసాగుతున్న గోల్ఫ్ కోర్స్‌ను క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధికి ఉపయోగపడే ముఖ్యమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర క్రీడా వేదికలకు అవసరమైన సహకారాన్ని భవిష్యత్తులోనూ అందిస్తామని భరోసా ఇచ్చారు.

## విజేతలకు అభినందనలు

ఐజీపీఎల్ టోర్నమెంట్‌లో పతకాలు, విజయాలు సాధించిన క్రీడాకారులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎన్‌డీటీవీ ప్రతినిధులు, తన మిత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి, భాస్కర్ రెడ్డి, ప్రత్యేకంగా ఆహ్వానించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు రావడానికి ఐదు నుంచి ఐదున్నర గంటల సమయం పడుతుందని, అయినప్పటికీ ఈ కార్యక్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని వచ్చానని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందజేశారు



# బుద్దారం భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి

- కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




వనపర్తి బ్యూరో అక్టోబర్ 10 (జనంసాక్షి) : గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలోని పెద్ద చెరువు ముంపు బాధితులకు ఎకరాకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. బుద్దారం గ్రామంలో భూ నిర్వాసితులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, వారి ఆందోళనకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. బాధితులకు అండగా ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పెద్ద చెరువు కారణంగా మొత్తం 210 ఎకరాల భూమి ముంపునకు గురవుతోందని తెలిపారు. ఇందులో గతంలో ముంపునకు గురైన భూమి 110 ఎకరాలు కాగా, కొత్తగా రిజర్వాయర్‌లో భాగంగా మరో 101 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. సుమారు మూడున్నరేళ్ల క్రితం చట్టపరిధిలో ఎకరాకు రూ.12 లక్షల నష్టపరిహారం అందిస్తామని, అదేవిధంగా దళితులకు దళిత బంధు, బీసీలకు బీసీ బంధు, ఇతర అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఎకరాకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చిన నాయకులు, ఇప్పుడు మళ్లీ ఎకరాకు రూ.12 లక్షలే ఇస్తామని చెప్పడం సరికాదని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని అన్నారు. కొడంగల్ నిర్వాసితులకు ఒక న్యాయం.. వనపర్తి నిర్వాసితులకు మరో న్యాయమా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. నిర్వాసితులందరికీ సమాన న్యాయం జరగాలని, బుద్దారం భూ బాధితులకు కూడా తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పేట మండలం పోలికపాడు శివారులో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ఆ భూమి వ్యవసాయానికి అనుకూలంగా లేనందున నిర్వాసితులకు ఒక ఎకరానికి బదులుగా మూడు ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలా చేయలేని పక్షంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. నిర్వాసితులు ఆందోళన చెందవద్దని, వారి తరఫున న్యాయపోరాటం చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నిరంజన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పోరాటానికి అండగా ఉంటానని తెలిపారు.

# ఎంఎస్‌ఎంఈల కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్'

- సమస్యల పరిష్కారానికి నెలకోసారి 'ఎంఎస్‌ఎంఈ గ్రీవెన్స్ డే'
- నగరంలోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి చర్యలు
- 'ఎల్ యూబీ ఎంఎస్‌ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ)ను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ విశ్వవ్యాప్తమయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానం తదితర అంశాల్లో ఎంఎస్‌ఎంఈలకు మార్గ నిర్దేశం చేస్తామన్నారు. లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని తాజ్ డెక్కన్ లో శనివారం నిర్వహించిన "ఎల్ యూబీ ఎంఎస్‌ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎంఎస్‌ఎంఈలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎస్‌ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. క్షేత్రస్థాయిలో ఎంఎస్‌ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ ఎంఎస్‌ఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై ఎంఎస్‌ఎంఈలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ బీఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరినీ తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. 'కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్', ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థు ఆధ్వర్యంలో రూపొందించిన 'భాగవతామృతం' (దృశ్య–శ్రవణ పద్యకథా మాలిక) మొదటి సంచికను బంజారాహిల్స్ లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో శనివారం ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ సమాజంలో నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన తగ్గుతోందన్నారు. ఇలాంటి తరుణంలో... మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భాగవతం లోని పద్యాలు, వాటి అంతరార్థాన్ని పిల్లలు, యువతకు సులభంగా అర్థమయ్యేలా ఆహ్లాదకరమైన సంగీతం, ఆకట్టుకునే దృశ్యరూపకంతో "భాగవతామృతం" పేరిట అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయ మన్నారు. విజ్ఞానంతో పాటు విలువలనూ పెంపొందించే ఇలాంటి తరహా సృజనాత్మక ప్రయోగాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. భాగవతాన్ని ప్రతి ఇంట్లో వినపడేలా చేసేందుకు కృషి చేసిన కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ నిర్వాహకులను, గాయకుడు నేమాని పార్థును మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గనుల శాఖ ప్రత్యేక అధికారి బీఆర్వీ సుశీల్ కుమార్, భోగరాజు మూర్తి, పార్థు నేమాని పాల్గొన్నారు.

# ఫోటోలు, వీడియోలతో బెదిరించి డబ్బుల వసూళ్లు..

- ఎంబీబీఎస్ విద్యార్థి అరెస్ట్!
- పీజీ విద్యార్థినిపై లైంగిక దాడి..
- పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి

చేవెళ్ల, అక్టోబర్ 10 (జనంసాక్షి) పీజీ విద్యార్థినిని లైంగికంగా వేధించి, ఆమెకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను బయటపెడతానని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసిన కేసులో ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని చేవెళ్ల పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని షాబాద్ ఎక్స్ రోడ్స్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చేవెళ్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కట్టా నరేందర్ రెడ్డి వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు విద్యాపరమైన విషయాల గురించి మాట్లాడే నెపంతో పీజీ విద్యార్థినితో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం ఆమె అంగీకారం లేకుండా లైంగిక దాడికి పాల్పడి, ఆమెకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను చిత్రీకరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆ తర్వాత వాటిని ఇతరులకు, సోషల్ మీడియాలో, బాధితురాలి కుటుంబ సభ్యులకు పంపిస్తానని బెదిరిస్తూ తనను వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో పాటు డబ్బులు డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు డబ్బులు ఇవ్వకపోతే ఫోటోలు, వీడియోలను బయటపెడతానని బెదిరించినట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో బాధితురాలి వివాహం మరో వ్యక్తితో నిశ్చయమవుతున్న విషయం తెలుసుకున్న నిందితుడు, ఆమెకు సంబంధించిన కొన్ని ఫోటోలను ఆ వ్యక్తికి పంపించినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. ఈ కేసు తొలుత ఖమ్మం జిల్లాలోని ఖానాపూర్ హవేలీ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌గా నమోదైంది. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా, క్రైమ్ నంబర్ 691/2026గా నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 10న చేవెళ్లలోని షాబాద్ ఎక్స్ రోడ్స్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న రెడ్‌మి మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా, కేసుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఉన్నట్లు గుర్తించి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఇన్‌స్పెక్టర్ కట్టా నరేందర్ రెడ్డి తెలిపారు.

# ప్రజాస్వామ్యం అమ్మకానికి కాదు!

- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

ఢిల్లీ (జనంసాక్షి) : ప్రజాస్వామ్యం అమ్మకానికి కాదని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా భారీ నిరసన చేపట్టాలని పిలుపునిచ్చామని, మోదీ ప్రభుత్వం ఈ నిరసనను చూసి ఆందోళనకు గురై జంతర్ మంతర్‌ను దిగ్బంధించింది. ఢిల్లీ నగరాన్ని పోలీసు శిబిరంగా, పారా మిలిటరీ బలగాల కంటోన్మెంట్‌గా మార్చివేసిందని, దాదాపు ఢిల్లీ బంద్‌ను తలపించే పరిస్థితిని సృష్టించి ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది. అయినప్పటికీ, ఈరోజు ఢిల్లీలో కనిపించింది రాజ్యాధికార బలప్రదర్శన కాదు.. ప్రజల అజేయ పోరాట స్ఫూర్తి! అని, తమలో కొంతమంది అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) సమీపంలో సమావేశమయ్యామని, అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) నాయకులు కామ్రేడ్స్ నేహా, డానిష్, అంజలి, ధనంజయ్, ప్రంజిత్‌లతో పాటు ప్రముఖ ప్రజాప్రయోజన న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ప్రజా ఉద్యమకారుడు యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ అతుల్ సూద్, మానవ హక్కుల కార్యకర్త నవ్‌షరణ్ కౌర్ తదితరులతో కలిసి ర్యాలీ నిర్వహిమని తెలిపారు. పోలీసులు ఏర్పాటు చేసిన మొదటి నిర్బంధ వలయాన్ని ఛేదించి ముందుకు సాగామని, సఫ్దర్‌జంగ్ ఫ్లైఓవర్‌పై జోర్‌బాగ్ కూడలికి సమీపం వరకు చేరుకున్నామని, అక్కడ ఏఐఎస్ఏ నాయకురాలు కామ్రేడ్ నేహా, ఢిల్లీ పార్టీ కార్యదర్శి రవి రాయ్, యోగేంద్ర యాదవ్‌తో పాటు అనేకమంది ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఇదే సమయంలో జంతర్ మంతర్ సమీపంలోని వివిధ ప్రాంతాల్లోనూ నిరసనకారులు గుమిగూడుతున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు పలువురిని, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని వివిధ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) నాయకులు అభిజీత్ దీప్కే, ఆశుతోష్ రంకా, సౌరభ్ దాస్‌లను విమానాశ్రయంలోనే అడ్డుకున్నారని, విమానం నుంచి బయటకు రాకముందే వారిని నిరోధించారని, ఇప్పుడు పోరాట రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రజలను అడ్డుకోవడానికి ప్రభుత్వానికి మిగిలింది రాజ్యాధికార బలప్రయోగం మాత్రమేనని, రాజకీయ కథనాన్ని నిర్మించుకోవడానికి, రాజ్యాంగబద్ధ సంస్థలను తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహం పూర్తిగా బట్టబయలైంది. మరోవైపు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మరింతమంది ప్రజలు ఈ పోరాటంలో భాగస్వాములవుతున్నారని, వారి సందేశం స్పష్టంగా ఉందని, ప్రజాస్వామ్యం అమ్మకానికి కాదు! ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడానికి, ధ్వంసం చేయడానికి మోదీ ప్రభుత్వాన్ని అనుమతించబోమని, ఈ సందేశం ఇంకా మోదీ టెలీప్రాంప్టర్‌పై కనిపించకపోవచ్చని, కానీ, వాస్తవాలను చదవగలిగేవారికి గోడపై రాసిన అక్షరాల్లా ప్రజల సందేశం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు.



# బతుకమ్మ సంబరాలకు రావాలని ఉప్పల శ్రీనివాస్ గుప్తకు ఆహ్వానం

హైదరాబాద్ (జనంసాక్షి) : నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసానికి బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రముఖ తెలంగాణ ఉద్యమకారిణి, ప్రజా ఉద్యమాల పోరాట వనిత విమలక్క విచ్చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలకు హాజరు కావాలని ఉప్పల శ్రీనివాస్ గుప్తని విమలక్క ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఉప్పల శ్రీనివాస్ గుప్త పట్టు చీరను అందజేశారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు ఉప్పల స్వప్న, సాయి కిరణ్, శార్వరి, సాయి తేజ, పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370